మంగళవారం
TUESDAY
10-11-2026

సంపుటి (Volume):2 || సంచిక: (Issue): 131

జగిత్యాల JAGITIAL || పేజీలు: (PAGES):12
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక



48 గంటలు కస్టడీ ఉంటే 'డీమ్డ్ సస్పెన్షన్'

ప్రభుత్వ ఉద్యోగుల అంశంలో సుప్రీం సంచలన తీర్పు

ప్రభుత్వ ఉద్యోగులకు సుప్రీంకోర్టు ఊహించని షాకిచ్చింది. ఓ ప్రభుత్వ ఉద్యోగి అరెస్ట్ అయి, 48 గంటలకు పైగా జ్యుడీషియల్ కస్టడీలో ఉంటే అతడిని ఆటోమేటిక్‌గా 'డీమ్డ్ సస్పెన్షన్' కింద పరిగణించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. అందుకోసం ప్రత్యేకంగా ఎలాంటి సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది. లంచం కేసులో అరెస్టయిన బిహార్‌లోని సమస్తిపూర్ సదర్ ఆసుపత్రి మేనేజర్‌కు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది.



న్యూఢిల్లీ: సమస్తిపూర్ సదర్ ఆసుపత్రిలో అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి, జీతాలు క్లియర్ చేయడానికి రూ.4 వేల లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలపై ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ కింద అరెస్ట్ అయ్యారు. దాదాపు 15 రోజులు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఆయనను సెషన్స్ కోర్టు బెయిల్‌పై విడుదల చేసింది. అయితే, సెషన్స్ కోర్టు ఇచ్చిన బెయిల్‌ను సవాలు చేస్తూ పాట్నా హైకోర్టులో పిటిషన్ దాఖలు కాగా.. హైకోర్టు ఆ బెయిల్‌ను రద్దు

తరువాయి 2 వ పేజీలో...



రంగారెడ్డి కలెక్టర్‌కు ఆర్నెల్ల జైలు

తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు.. కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు నిర్ధారణ

కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన కేసులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డికి తెలంగాణ హైకోర్టు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించింది. రూ.2 వేల జరిమానా కూడా చెల్లించాలని ఆదేశించింది. జస్టిస్ కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. అయితే అప్పీలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ శిక్ష అమలును నాలుగు వారాల పాటు నిలిపివేసింది.

హైదరాబాద్, నవంబర్ 9 (ఈవార్తలు): రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 22-ఏ ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న కొన్ని ప్లాట్లను తొలగించాలంటూ బాధితులు గతంలో హైకోర్టును ఆశ్రయించారు. వారి వినతిని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని 2025 ఆగస్టులో కలెక్టర్‌ను కోర్టు ఆదేశించింది. 60 రోజుల్లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. అయితే గడువు ముగిసినా కలెక్టర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో బాధితులు 2025 అక్టోబరు 15న కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఆ తర్వాతే అధికారులు స్పందించారు. బాధితులకు తరువాయి 2 వ పేజీలో...



జనవరి 25 నుంచి తెలంగాణలో జనగణన

హైదరాబాద్, నవంబర్ 9 (ఈవార్తలు): రాష్ట్రంలో జనగణన నిర్వహణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. తెలంగాణలో జనగణన -2027 నిర్వహణకు తేదీలు ఖరారు చేసింది. జనవరి 25వ తేదీ నుంచి జనగణన మొదలు కానుంది. జనవరి 25వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఇంటింటి జనాభా లెక్కల



వైట్‌హౌస్ టెంపరరీ లాక్‌డౌన్



ఓయూలో పొలిటికల్ బడి!

నాయకులుగా ఎదిగేందుకు పాఠాలు.. రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై అవగాహన

యూనివర్సిటీ విద్యార్థుల వినూత్న చర్యలు

డిసెంబర్ 30న ఆర్ట్స్ కాలేజీలో పొలిటికల్ అకాడమీ ప్రారంభం

మరోసారి రాజకీయ చైతన్యానికి వేదికగా ఉస్మానియా వర్సిటీ

రాజకీయాలంటే పదవులు, అధికారం, ఎన్నికలే కాదు.. ప్రజాసేవ, సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్య విలువల సమాహారమని యువతకు చాటిచెప్పే ప్రయత్నం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మొదలైంది. రాజకీయాలపై ఆసక్తి ఉన్న యువతకు సరైన అవగాహన, శిక్షణ అందించడంతో పాటు భవిష్యత్తు నాయకులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో విద్యార్థులు ప్రత్యేకంగా పొలిటికల్ అకాడమీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. రాజకీయాల్లోకి రావాలంటే డబ్బు, కులం, కుటుంబ రాజకీయ నేపథ్యమే అర్హత కావాల్సిన అవసరం లేదని.. జ్ఞానం, నిబద్ధత, ప్రజాసేవా దృక్పథం ఉన్న సామాన్య యువత కూడా నాయకులుగా ఎదగవచ్చనే సందేశంతో ఈ వేదికను రూపొందిస్తున్నారు.

హైదరాబాద్, నవంబర్ 9 (ఈవార్తలు): ఈ మేరకు సోమవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీలో పొలిటికల్ అకాడమీ పోస్టర్‌ను ప్రొఫెసర్లు, విద్యార్థులు కలిసి ఆవిష్కరించారు. ప్రొఫెసర్లు శ్రీలత, కొండా నాగేశ్వరరావు, వంశీధర్, చలమల వెంకటేశ్వర్లు, రవి, రమేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అకాడమీ స్థాపకులు శ్రీధర్ యాదవ్, రామకృష్ణ, కరణ్, రత్న శేఖర్ రెడ్డి, సురేందర్ మాట్లాడుతూ.. యువతలో రాజకీయ అవగాహన, ప్రశ్నించే తత్వం, విమర్శనాత్మక ఆలోచన, బాధ్యతాయుత నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యమని వివరించారు. డిసెంబర్ 30న ఆర్ట్స్ కాలేజీలో అకాడమీని అధికారికంగా ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. రాజ్యాంగం, ఓటు హక్కు, ఎన్నికల వ్యవస్థ, పంచాయతీరాజ్, ప్రభుత్వ పాలన, ప్రజా విధానాలు, సామాజిక న్యాయం వంటి అంశాలపై యువతకు క్రమబద్ధమైన శిక్షణ అందించనున్నారు. కేవలం తరగతి తరువాయి 2 వ పేజీలో...

'అగ్రి' వీసీపై సమరభేరి!

న్యాయం కోసం రోడ్డెక్కిన బోధనా సిబ్బంది, విద్యార్థులు

అల్దాస్ జానయ్యపై లైంగిక వేధింపులు ఆరోపణలు

ఫిర్యాదులపై చర్యలేవంటూ ప్రభుత్వాన్ని నిలదీత

విచారణకు హాజరుకావాలని వీసీకి మహిళా కమిషన్ నోటీసులు



హైదరాబాద్, నవంబర్ 9 (ఈవార్తలు): ఉన్నత విద్యాసంస్థల్లో మహిళలకు రక్షణ కరువవుతోందా? విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన విశ్వవిద్యాలయాల్లోనే మహిళా ఉద్యోగులకు వేధింపులు ఎదురైతే ఇక వారి గోడు వినేదెవరు? రాజేంద్రనగర్‌లోని ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చోటుచేసుకున్న పరిణామాలు ఈ ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్యపై ఓ మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ లైంగిక, మానసిక వేధింపులు, బెదిరింపుల ఆరోపణలు చేయడం కలకలం రేపుతోంది. తన ఫిర్యాదులపై అధికారులు స్పందించడం లేదని, న్యాయం జరగడం లేదని ఆమె మీడియా ముందుకు వచ్చి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై తోటి మహిళా ప్రొఫెసర్లు, బోధనా సిబ్బంది, విద్యార్థులు -2 వ పేజీలో...

బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

గ్రాము-24 క్యారెట్స్):	రూ.14,460
వెండి (కిలో):	రూ.2,05,000
ప్లాటినం (గ్రాము):	రూ.4,683

విశ్వవాణి



కందిపప్పు, మినుములు, శనగలు, బీన్స్, పాలకూర వంటి మొక్కల ఆధారిత ఆహార పదార్థాల్లో ఉండే ఇనుమును 'నాన్‌హీమ్ ఐరన్' అంటారు. మాంసాహార పదార్థాల్లో లభించే ఇనుముతో పోలిస్తే శరీరం దీన్ని తక్కువ సమర్థతతో గ్రహిస్తుంది. అయితే విటమిన్ సి అధికంగా ఉండే ఆహార పదార్థాలను వీటితో కలిపి తీసుకుంటే ఇనుము శోషణ మెరుగుపడుతుంది. నారింజ, నిమ్మ, బత్తాయి వంటి పండ్లు, టమాటాలు, స్ట్రాబెర్రీల్లో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇవి పేగుల్లో మొక్కల ఆహారం నుంచి ఇనుము గ్రహించే ప్రక్రియను ప్రభావితం చేస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు.



సునామీ సృష్టిస్తా

మోదీ, కేడీ కొట్టుకుపోవడం ఖాయం

సంక్రాంతి తర్వాత 'ప్రజాబలం'తో జిల్లాల పర్యటన

'రైతన్నతో ఆత్మీయ సభ'లో సీఎం రేవంత్

వికారాబాద్, నవంబర్ 9 (ఈవార్తలు): సంక్రాంతి తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 'ప్రజాబలం' కార్యక్రమం ద్వారా జిల్లాలన్నీ తిరిగి ప్రజలతో మమేకమవుతానని చెప్పారు. రాష్ట్రంలో సునామీ సృష్టిస్తానని.. ఆ సునామీలో మోదీ, కేడీ కొట్టుకుపోవాలని వ్యాఖ్యానించారు. వికారాబాద్ జిల్లా హకీంపేట్‌లో 'రైతన్నతో ఆత్మీయ సభ' పేరుతో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రయాణం, ప్రజలు తనకు ఇచ్చిన అవకాశాలు, పాలమూరు ప్రాంత అభివృద్ధి, గత ప్రభుత్వ పాలన, ఉద్యోగుల జీతాలు, జర్నలిస్టుల సమస్యలపై రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "దేవుడు నాకు అన్ని పదవులూ ఇచ్చాడు. ప్రజలు నన్ను ఆదరించి ముఖ్యమంత్రి స్థాయికి తీసుకొచ్చారు. ఇక ప్రజలకు తిరిగి తరువాయి 2 వ పేజీలో...



పవన్-అన్నా విడాకులు

అమరావతి, నవంబర్ 9 (ఈవార్తలు): ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆయన భార్య అన్నా కొణిదెల విడాకులు తీసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారానికి బలం చేకూర్చేలా వారిద్దరూ సంయుక్తంగా విడాకుల ప్రకటన చేశారంటూ ఓ లేఖ సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది. సదరు సోషల్ మీడియా పోస్టులో .. తరువాయి 2 వ పేజీలో...

సొరంగం తవ్వి పారిపోయిన ఆడపులి

బెంగాల్‌లోని బుక్సా టైగర్ రిజర్వ్‌లో వింత ఘటన

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని బుక్సా టైగర్ రిజర్వ్‌లో ఓ విచిత్రమైన ఘటన చోటుచేసుకుంది. అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎన్‌క్లోజర్ పునాది కింద సొరంగం తవ్వి మూడేళ్ల ఆడపులి చాకచక్యంగా తప్పించుకుంది. అసోం నుంచి తిరిగి తీసుకొచ్చిన కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే ఈ ఘటన జరగడంతో అటవీ అధికారులు విస్మయానికి గురయ్యారు. బెంగాల్‌లో పులుల సంఖ్యను పెంచే ప్రాజెక్టులో భాగంగా బీహార్‌లోని



రూ.500 నోట్లు రద్దు చేయాలి

డిజిటల్ కరెన్సీ వాడకాన్ని పెంచాలి.. ఏపీ సీఎం చంద్రబాబు ప్రతిపాదన

అమరావతి, నవంబర్ 9 (ఈవార్తలు): దేశంలో అవినీతిని అరికట్టాలంటే నగదు లావాదేవీలను తగ్గించి డిజిటల్ కరెన్సీ వినియోగాన్ని విస్తృతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మరోసారి అభిప్రాయం వ్యక్తం చేశారు. రూ.500 నోట్లను కూడా రద్దు చేసి.. మార్కెట్‌లో రూ.100, రూ.200 నోట్లు మాత్రమే ఉండేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. పెద్ద నోట్ల వినియోగం తగ్గితే నగదు రూపంలో జరిగే అక్రమ లావాదేవీలకు అడ్డుకట్ట వేయవచ్చని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. డిజిటల్ కరెన్సీని ప్రోత్సహించడం ద్వారా అవినీతి నియంత్రణకు మార్గం ఏర్పడుతుందని పేర్కొన్నారు. సోమవారం అమరావతిలో తరువాయి 2 వ పేజీలో...





సబ్బులు, సర్ఫ్‌లు పిరం

హిందుస్థాన్ యూనిలీవర్ షాక్

సర్ఫ్ ఎక్సెల్ నుంచి వీల్, రిన్ వరకు ధరల పెంపు

న్యూఢిల్లీ: పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో పలు రంగాల్లో ఉత్పత్తుల తయారీపై గణనీయమైన ప్రభావం పడిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా క్రూడాయిల్ ధరలు పెరగడం ఇదే సమయంలో రవాణా వ్యవస్థలో సరఫరా అంతరాయాలతో -2 వ పేజీలో...

రాశి ఫలాలు
10.11.2026

మేషం: వ్యాపారాలు అభివృద్ధి బాటలో సాగుతాయి. నూతన వ్యవహారాలను ప్రారంభిస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ధన వ్యవహారాలు కలసివస్తాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగపరంగా అధిక చర్చలు సఫలం అవుతాయి.

వృషభం: వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆప్తులతో విభేదాలు చికాకు పరుస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. ఋణ ప్రయత్నాలు ఫలించవు. వృధా ఖర్చులు అధికమవుతాయి. చేపట్టిన వ్యవహారాలలో జాప్యం కలుగుతుంది.

మిథునం: సన్నిహితుల నుండి విలువైన సమాచారం సేకరిస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో పెద్దలతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. చిన్ననాటి మిత్రుల నుండి ధన సహాయం అందుతుంది.

కర్కాటకం: వ్యాపారాలలో స్థిరమైన ఆలోచనలు చేయలేక నష్టపడతారు. చేపట్టిన పనులలో అధిక శ్రమతో అల్ప ఫలితం పొందుతారు. మానసిక సమస్యలు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో పరిస్థితులు ప్రతికూలంగా మారుతాయి. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఋణ భారం అధికమౌతుంది.

సింహం: వృత్తి వ్యాపారాలలో శ్రమ ఫలించి నూతన లాభాలు పొందుతారు. స్థిరాస్తి ఒప్పందాలు కలసి వస్తాయి. దీర్ఘకాలిక ఋణాల తొలగుతాయి. ఉద్యోగమున అధికారుల అనుగ్రహం కలుగుతుంది. నిరుద్యోగ ప్రయత్నాలు లాభసాటిగా సాగుతాయి. ప్రయాణాలలో నూతన వ్యక్తుల పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి.

కన్య: ముఖ్యమైన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. నిరుద్యోగులు నూతన అవకాశాలు పొందుతారు. మొండి బాకీలు వసూలవుతాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగమున ఉన్నత కలుగుతుంది. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

తుల: వ్యాపారాలు సాధారణంగా సాగుతాయి. చేపట్టిన పనులు నత్తనడకన సాగుతాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. ఉద్యోగమున పనిభారం పెరుగుతుంది. ధన వ్యవహారాలలో జాగ్రత్త అవసరం. ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడి పెరుగుతుంది.

వృశ్చికం: ఉద్యోగమున గందరగోళ పరిస్థితులు ఉంటాయి. అనవసర వస్తువులపై ధనవ్యయం చేస్తారు. నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది కాదు. కుటుంబ సభ్యులు మీ మాటతో విభేదిస్తారు. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి.

ధనస్సు: వ్యాపారాలలో అంచనాలు అందుకుంటారు. ఆత్మీయుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగమున ఉత్సాహకర వాతావరణం ఉంటుంది. స్థిరాస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. వృత్తి వ్యాపారాలలో భాగస్వాములతో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. ఆర్థికంగా ఆశించిన పురోగతి కలుగుతుంది.

మకరం: వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో కార్యసిద్ధి కలుగుతుంది. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలలో అధికారుల అనుగ్రహం కలుగుతుంది. ఆప్తుల నుండి ఆశించిన సహాయం అందుతుంది. ఆకస్మిక ధన వస్తులాభాలు పొందుతారు.

కుంభం: వ్యాపారాలు ఆశించిన రీతిలో లాభించవు. ముఖ్యమైన పనులు వాయిదా పడుతాయి. నిరుద్యోగులకు నిరాశ తప్పదు. వృధా ఖర్చులు పెరుగుతాయి. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. కుటుంబ వాతావరణం చికాకుగా ఉంటుంది. సన్నిహితులతో ధన వ్యవహారాలలో విభేదాలు కలుగుతాయి.

మీనం: బంధువులతో అకారణ వివాదాలు కలుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో అవాంతరాలు కలుగుతాయి. స్వల్ప ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో ఊహించని సమస్యలు తప్పవు. నూతన ఋణాలు చెయ్యవలసి వస్తుంది. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి.

సునామీ సృష్టిస్తా

మొదటి పేజీ తరువాయి

ఇవ్వాల్సిన బాధ్యత నాపై ఉంది" అని పేర్కొన్నారు. పాలమూరు ప్రజలు తనను ఎంపీగా గెలిపించినప్పుడు కేసీఆర్ ఆ ప్రాంత రుణం తీర్చుకుంటారని ఆశించామని.. కానీ ఆయన ప్రజలను నిరాశపరిచి గజ్వేల్‌కు వెళ్లారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. పాలమూరు నుంచి ఎంతోమంది నాయకులు, మంత్రులు వచ్చినా వలసలు మాత్రం ఆగలేదన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే ప్రాజెక్టుల నిర్మాణ పనులకు పాలమూరు ప్రజలు కూలీలుగా వెళ్లాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలు గడిచినా ఈ ప్రాంతంలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాలేదని ఆరోపించారు. గతంలో చేపట్టిన మక్తల్-నారాయణపేట ప్రాజెక్టును కేసీఆర్ ప్రభుత్వం పక్కన పెట్టిందని విమర్శించారు. తమ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తుంటే అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కొడంగల్ ప్రాంత అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన నిధులను వినియోగించినప్పటికీ, ఉద్యోగులకు జీతాలు ఇచ్చేందుకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు, వాటిపై వడ్డీల భారం తమ ప్రభుత్వంపై ఉందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరి 1వ తేదీ నుంచి ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన నిధులను ప్రతి నెలా పదో తేదీలోపు విడుదల చేస్తున్నామని.. ప్రభుత్వ పనులు చేసిన కాంట్రాక్టర్లకు 20వ తేదీలోపు బిల్లులు చెల్లిస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వ అప్పులకు సంబంధించి ఏటా సుమారు రూ.80 వేల కోట్ల భారం పడుతోందని.. ఇప్పటివరకు రూ.2 లక్షల కోట్లకు పైగా వడ్డీ చెల్లించామని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ గడ్డం పెంచుకున్నంత మాత్రాన నాయకుడు కాలేరని.. గడ్డం రావడానికి 50 ఏళ్లు పట్టిందని, బుద్ధి రావడానికి ఎన్ని సంవత్సరాలు పడుతుందో తెలియదని ఎద్దేవా చేశారు. పది జన్మలు ఎత్తినా తనలా కాలేరంటూ వ్యాఖ్యానించారు. జర్నలిస్టుల సమస్యలపైనా సీఎం రేవంత్ స్పందించారు. గతంలో జర్నలిస్టులకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను సుప్రీంకోర్టు రద్దు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ సమస్యకు పరిష్కారం చూపించి అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని మీడియా మిత్రుల సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కొడంగల్ నియోజకవర్గంలో సీఎం పర్యటన సందర్భంగా సుమారు రూ.9,053 కోట్ల విలువైన 13 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టారు. ఇందులో రూ.5,060 కోట్లతో నిర్మించనున్న రేడియల్ రోడ్-2, రూ.2,100 కోట్లతో చేపట్టనున్న మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం రెండో దశ, రూ.1,410 కోట్లతో 223 బీటీ రోడ్ల పనులు ప్రధానమైనవి. లగచర్ల పారిశ్రామిక కారిడార్‌లో రూ.81 కోట్లతో ఎకో పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని రైతులు, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడమే 'ప్రజాబలం' కార్యక్రమం ఉద్దేశమని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. సంక్రాంతి తర్వాత గ్రామాల్లో పర్యటించి ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుంటానని, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

రూ.500 నోట్లు రద్దు చేయాలి

మొదటి పేజీ తరువాయి

నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై మాట్లాడిన ఆయన.. రాజకీయాల్లో డబ్బు ప్రభావం తగ్గాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధులకు సేవాభావం ప్రధాన లక్షణంగా ఉండాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో నగదు పంపిణీని చాలావరకు తగ్గించినప్పటికీ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయం సాధించిందని చెప్పారు. దేశంలో అవినీతిని నిర్మూలించేందుకు పెద్ద నోట్ల వినియోగాన్ని తగ్గించాలని సీఎం చంద్రబాబు సూచించారు. రూ.500 నోటును రద్దు చేసి.. రూ.100, రూ.200 నోట్లతో పాటు డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలని కోరారు. ఈ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్తానే ఉంటానని స్పష్టం చేశారు. టెక్నాలజీని సమర్థంగా వినియోగించుకుంటే సంపద సృష్టి సాధ్యమవుతుందని.. పేదరిక నిర్మూలన కూడా సాధ్యమేనని అభిప్రాయపడ్డారు. పెద్ద నోట్లను రద్దు చేయాలన్న అభిప్రాయాన్ని చంద్రబాబు ఇప్పుడే వ్యక్తం చేయడం లేదు. 2017 సెప్టెంబర్‌లోనే రూ.2,000, రూ.500 నోట్లు ఎందుకని ప్రశ్నిస్తూ.. రూ.100, రూ.200 నోట్లు సరిపోతాయని.. లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లో జరిగేలా చూడాలని సూచించారు. వ్యవస్థలోనే అవినీతిని నిర్మూలించేలా మార్పులు తీసుకురావాలని అప్పట్లో ఆయన పేర్కొన్నారు. 2025 మేలో నూ డిజిటల్ కరెన్సీపై తన ఆలోచనలను మరోసారి వెల్లడించారు. డిజిటల్ కరెన్సీపై తాను ఇచ్చిన రిపోర్ట్‌ను ప్రధాని మోదీకి వివరించినట్లు చెబుతూ.. అవసరమైతే రూ.500, రూ.1,000, రూ.2,000 నోట్ల ముద్రణను నిలిపివేసి డిజిటల్ కరెన్సీని ప్రోత్సహించాలని కోరినట్లు తెలిపారు. డిజిటల్ లావాదేవీల ద్వారా అక్రమ చెల్లింపులను గుర్తించడం సులభమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కాగా, 2023 మేలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రూ.2,000 నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించినప్పుడు కూడా చంద్రబాబు ఆ నిర్ణయాన్ని స్వాగతించారు. పెద్ద నోట్ల వినియోగం వల్ల అక్రమంగా సంపద కూడబెట్టే అవకాశాలు పెరుగుతాయని.. రాజకీయ అవినీతిని తగ్గించాలంటే పెద్ద నోట్లను రద్దు చేయాలని తాను గతంలోనే కేంద్ర ప్రభుత్వానికి సూచించినట్లు చెప్పారు. అయితే ఆర్బీఐ 2023లో రూ.2,000 నోట్లను పూర్తిగా చట్టబద్ధత కోల్పోయేలా రద్దు చేయలేదు. కేవలం రూ.2000 నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం కూడా ఆ నోట్లు చట్టబద్ధమైన కరెన్సీగానే కొనసాగుతున్నాయి. బ్యాంకుల్లో డిపాజిట్, మార్పిడి గడువు ముగిసినప్పటికీ.. ఆర్బీఐకి చెందిన 19 కార్యాలయాల ద్వారా ఈ సదుపాయం కొనసాగుతోంది. మే 1వ తేదీ నాటి ఆర్బీఐ ప్రకటన ప్రకారం.. అప్పటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 98.47 శాతం తిరిగి వచ్చాయి. 2016 నవంబర్‌లో కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దు నిర్ణయం తీసుకుంది. అప్పటివరకు చెలామణిలో ఉన్న పాత రూ.500, రూ.1,000 నోట్లకు చట్టబద్ధమైన చెల్లుబాటును తొలగించింది. ఆ తర్వాత కొత్త రూ.500, రూ.2,000 నోట్లు ప్రవేశపెట్టింది. అయితే 2023లో రూ.2,000 నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్బీఐ ప్రకటించింది. ఈ నిర్ణయం నోట్ల రద్దు కాదు.. చెలామణి నుంచి ఉపసంహరణ మాత్రమేనని స్పష్టం చేసింది.

సారంగం తవ్వి పారిపోయిన ఆడపులి

మొదటి పేజీ తరువాయి

వాల్మీకి టైగర్ రిజర్వ్ నుంచి 'టీ-138' (బీటీఆర్-టీఎఫ్1) అనే ఆడపులిని తీసుకొచ్చారు. అక్టోబర్ 2న బుక్సాలోని 25వ మైలు వద్ద ఉన్న 2.2 హెక్టార్ల ఎన్‌క్లోజర్‌లో దీనిని విడిచిపెట్టగా, అక్టోబర్ 4నే బయటపడి సంకోష్ నది దాటి అసోంలోని రైమోనా ప్రాంతానికి వెళ్లిపోయింది. అనేక రోజులు శ్రమించి, చివరకు నవంబర్ 3న మత్తుమందు ఇచ్చి పట్టుకుని మళ్లీ బుక్సా ఎన్‌క్లోజర్‌కు చేర్చారు. అయితే, ఆదివారం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో ఆ పులి ఎన్‌క్లోజర్ ఫెన్సింగ్ పునాది కింద మట్టిని సొరంగంలా తవ్వి బయటకు జారుకుంది. ప్రస్తుతం అది బాలా నదిని దాటి తూర్పు వైపుగా అసోం దిశగా వెళ్తున్నట్లు తెలిసింది. గతంలో వెళ్లిన మార్గంలోనే ప్రయాణిస్తే జయంతి, రైడక్, సంకోష్ నదులను దాటి అసోం లేదా భూటాన్ అడవుల్లోకి ప్రవేశించే అవకాశముంది. సాధారణంగా కుక్కలు లేదా హైనాల మాదిరిగా పులులు నేలను లోతుగా తవ్వలేవని, ఎన్‌క్లోజర్ పునాది పటిష్ఠంగా నిర్మించి ఉంటే ఇలా జరిగేది కాదని వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా మాజీ శాస్త్రవేత్త ఒకరు అభిప్రాయపడ్డారు. దీంతో ఈ ఎన్‌క్లోజర్ నిర్మాణ నాణ్యత, భద్రతా లోపాలపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఓయూలో పొలిటికల్ బడి!

మొదటి పేజీ తరువాయి

గది చర్చలకే పరిమితం కాకుండా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయించి, వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించేలా ప్రోత్సహించనున్నారు. మేధావులు, నిపుణులు, జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులతో సదస్సులు, చర్చలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మహిళలు, నిరుద్యోగ యువత, రైతులు, వెనుకబడిన వర్గాలకు నాయకత్వ అవకాశాలు కల్పించడం ద్వారా రాజకీయాల్లో సమగ్ర భాగస్వామ్యాన్ని పెంచాలని అకాడమీ భావిస్తోంది. సామాజిక మాధ్యమాల బాధ్యతాయుత వినియోగం, తప్పుడు వార్తలను గుర్తించడం, ప్రజాస్వామ్య సంస్థల పనితీరు, ప్రభుత్వ జవాబుదారీతనం వంటి అంశాలపైనా అవగాహన కల్పించనున్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం వంటి రాజ్యాంగ మౌలిక విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లడం కార్యక్రమంలో మరో ముఖ్యాంశం.

పార్టీలకు అతీతంగా స్వతంత్ర వేదిక

ఈ పొలిటికల్ అకాడమీ ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా ఉండదని, స్వతంత్ర విద్యా వేదికగా పనిచేస్తుందని స్థాపకులు స్పష్టం చేశారు. భిన్న రాజకీయ సిద్ధాంతాలను అధ్యయనం చేయడం, వాటిపై చర్చించడం, పాలనా విధానాలను విశ్లేషించడం ద్వారా యువతలో స్వతంత్ర ఆలోచనా ధోరణిని పెంపొందించనున్నట్లు తెలిపారు. రాజకీయాలను కొందరి చేతుల్లోని అధికార సాధనంగా కాకుండా ప్రతి సామాన్యుడికి అందుబాటులో ఉండే ప్రజాసేవా వేదికగా మార్చాలన్నదే తమ సంకల్పమని పేర్కొన్నారు. ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ వేదికగా ప్రారంభమయ్యే ఈ ప్రయాణం గ్రామ సర్పంచ్ స్థాయి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి, దేశ ప్రధానమంత్రి స్థాయి వరకు సమర్థులైన నాయకులను తీర్చిదిద్దే దిశగా సాగాలన్నది అకాడమీ స్థాపకుల ఆకాంక్ష. రాజకీయాల్లో అవకాశాలు కొందరికే పరిమితం కాకుండా అర్హత, ప్రజాసేవా నిబద్ధత ఉన్న ప్రతి ఒక్కరికీ అందాలన్నదే తమ ఆశయమని వారు వెల్లడించారు.

సబ్బులు, సర్ఫ్‌లు పిరం

మొదటి పేజీ తరువాయి

ముడి సరుకుల ధరలు భారమయ్యాయి. ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు కూడా పెరిగిపోయాయి. వీటిల్లో ముడి సరుకుల ధరల ప్రభావం ఎక్కువగా నిత్యావసర సరుకులపై ప్రభావం చూపిస్తోంది. పెద్ద ఎలక్ట్రానిక్ వస్తువులు, కార్లు వంటి వాటిపైనా ఇప్పటికే ప్రభావం పడగా ధరలు పెరిగాయి. ఇప్పుడు రోజువారీ వినియోగ వస్తువుల ధరలు కూడా మరోసారి పెరిగాయి. ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థ హిందుస్థాన్ యూనిలీవర్ తన హోం కేర్ ప్రొడక్ట్స్ ధరల్ని పెంచుతున్నట్లు ప్రకటించింది. వీటిల్లో ప్రముఖ డిటర్జెంట్లు అందరి ఇళ్లలో వాడే సర్ఫ్ ఎక్సెల్, వీల్, రిన్ వంటి బ్రాండ్స్ ఉన్నాయి. ప్యాక్ సైజుల్ని బట్టి ఈ డిటర్జెంట్ ధరలు 11 శాతం వరకు పెరిగాయి. ఇందులో ఒక్కో ప్యాక్‌పై కనీసం రూ. 1 నుంచి గరిష్ఠంగా రూ. 10 వరకు ధరల్ని పెంచింది. దీంతో ఆయా డిటర్జెంట్ బ్రాండ్లను కొనుగోలు చేసేవారిపై ఇప్పుడు అదనపు భారం పడనుంది. ఇక్కడ ప్రధానంగా పశ్చిమాసియా ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సరఫరా వ్యవస్థ అంతరాయాలతో పెరుగుతున్న ముడి సరుకుల ధరల కారణంగా ఉత్పత్తి ఖర్చులు అధికం అవుతున్నాయి. ఈ ఖర్చుల ఒత్తిడిని ఎదుర్కొంటూనే కంపెనీ లాభాల మార్జిన్లను కాపాడుకోవడంలో భాగంగా ధరల్ని సవరిస్తున్నట్లు తెలుస్తోంది. డిటర్జెంట్ల తయారీలో వినియోగించే ఇతర రసాయనాలు, ఇతర ఇన్‌పుట్ ఖర్చులు పెరిగితే కంపెనీల ఉత్పత్తి వ్యయంపై ప్రభావం పడుతోంది. ఈ క్రమంలోనే ఆ భారాన్ని కొంత మేర కస్టమర్లకు బదిలీ చేసి కంపెనీలు తమ లాభాల్ని కాపాడుకోవాలని చూస్తున్నాయి.

రంగారెడ్డి కలెక్టర్‌కు ఆర్నెల్ల జైలు

మొదటి పేజీ తరువాయి

నోటీసులు జారీ చేసి, 2026 ఫిబ్రవరి 26న వారి వినతిని తిరస్కరించారు. అనంతరం జులై 8న మరోసారి తిరస్కరణ ఉత్తర్వులు ఇచ్చారు. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైన తర్వాతే అధికారులు స్పందించడం, కోర్టు ఆదేశించిన గడువులోగా నిర్ణయం తీసుకోకపోవడంపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఉద్దేశపూర్వకంగానే కలెక్టర్ కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారని నిర్ధారించింది. ఐఏఎస్ స్థాయి అధికారి న్యాయస్థానం ఆదేశాలను నిర్లక్ష్యం చేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేస్తూ ఆరు నెలల జైలు శిక్ష విధించింది. అయితే, అప్పీలుకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది.

జనవరి 25 నుంచి తెలంగాణలో జనగణన

మొదటి పేజీ తరువాయి

సేకరణ చేపట్టనున్నారు. జనవరి 10 నుంచి 24వ తేదీ వరకు ప్రజలు స్వయంగా (స్వీయ జనగణన) తమ వివరాలను నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అనంతరం మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు రివిజనల్ రౌండ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు 2027 మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలు ప్రామాణిక తేదీగా నిర్ణయించి జీవో ఎంఎస్ నెం.155 జారీ చేసింది. కేంద్రం నోటిఫికేషన్ ఇవ్వగా దానికి అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ చేసింది.

'అగ్రి' వీసీపై సమరభేరి!

మొదటి పేజీ తరువాయి

ఒక్కటై నిరసనలకు దిగడంతో వర్సిటీ అట్టుడుకుతోంది. విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ముసిని తేజశ్రీ.. వీసీ తనను వ్యక్తిగతంగా, లైంగికంగా వేధించారని ఆరోపించారు. పీహెచ్‌డీ పూర్తి చేసేందుకు గడువు పొడిగింపు కోరుతూ వీసీని కలిసినప్పటి నుంచి వేధింపులు మొదలయ్యాయని ఆమె వెల్లడించారు. తన భర్తను వదిలేస్తే తనతో ఉంటానంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారని, వ్యక్తిగతంగా కలవాలని ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. అర్ధరాత్రి ఫోన్ కాల్స్ చేయడం, తనను ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలను వీసీ ఖండించారా? ఆయన వివరణ ఏమిటన్నది కూడా విచారణలో తేలాల్సి ఉంది.

ఫిర్యాదులిచ్చినా స్పందనేదీ?

వేధింపులపై తెలంగాణ డీజీపీ, మహిళా భద్రతా విభాగం తదితర అధికారులను ఆశ్రయించినా తగిన స్పందన రాలేదని తేజశ్రీ ఆరోపించారు. ఫిర్యాదు చేసిన తర్వాత తనను నిజామాబాద్‌కు బదిలీ చేశారని, ఇది తనపై కక్షసాధింపు చర్యగా భావిస్తున్నానని పేర్కొన్నారు. కేసును వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి, బెదిరింపులు ఎదురవుతున్నాయని కూడా ఆరోపించారు. ఈ పరిణామాలపై పోలీసుల స్పందన, ఫిర్యాదుల ప్రస్తుత స్థితి స్పష్టత రావాల్సి ఉంది. మహిళా ప్రొఫెసర్ ఆరోపణలు, న్యాయం కోసం ఆమె చేస్తున్న పోరాటానికి మద్దతుగా టాసా అసోసియేషన్ ఆధ్వర్యంలో బోధనా సిబ్బంది, విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ వీసీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బాధిత మహిళకు న్యాయం చేయకుండా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి అండగా నిలుస్తారా? మహిళలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం ఏం చేస్తోంది? అంటూ ప్రశ్నించారు. వర్సిటీలో మహిళలపై వేధింపులు ఆగాలని, ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొన్న బోధనా సిబ్బందిపై చర్యలు తీసుకున్నప్పుడు, ప్రస్తుత వ్యవహారంలో ఎందుకు జాప్యం జరుగుతోందని నిలదీశారు.

ఈ వ్యవహారంపై తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ స్పందించింది. మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫిర్యాదు మేరకు వీసీ అల్దాస్ జానయ్యకు నోటీసులు జారీ చేసింది. నవంబర్ 12న మధ్యాహ్నం 12.30 గంటలకు హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో విచారణకు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. దీంతో ఇప్పటివరకు ఆరోపణలు, నిరసనలకే పరిమితమైన వ్యవహారం అధికారిక విచారణ దిశగా సాగుతోంది. విశ్వవిద్యాలయానికి అధిపతిగా ఉండే వ్యక్తిపైనే మహిళా ఉద్యోగి ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు చేస్తుండటం, మరోవైపు బోధనా సిబ్బంది, విద్యార్థులు నిరసనలకు దిగడం ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. రాజకీయంగా ముఖ్యులతో సాన్నిహిత్యం ఉందనే ప్రచారంతో చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక ఆధారాలు వెల్లడికావాల్సి ఉంది. మహిళా ఉద్యోగుల భద్రత, ఫిర్యాదులపై సత్వర స్పందన, నిష్పాక్షిక విచారణ ప్రభుత్వ బాధ్యతగా నిలుస్తున్నాయి. మహిళా కమిషన్ విచారణతోనైనా ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయా? బాధితురాలికి న్యాయం జరుగుతుందా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

పవన్-అన్నా విడాకులు

మొదటి పేజీ తరువాయి

'వైవాహిక బంధం ముగిసినప్పటికీ తాము మంచి స్నేహితులుగా కొనసాగుతామని పవన్,అన్నా కొణిదెల స్పష్టం చేశారు. పిల్లల సంతోషం, భవిష్యత్తు తమ ఇద్దరికీ అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. వారి సంక్షేమమే తమ ప్రథమ ప్రాధాన్యం అని పేర్కొన్నారు. ఈ వ్యక్తిగత నిర్ణయానికి సంబంధించిన సమయంలో తమ గోప్యతను గౌరవించాలని అభిమానులు, శ్రేయోభిలాషులు, మీడియా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ఇన్నాళ్లూ తమకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ పవన్ కల్యాణ్, అన్నా కొణిదెల కృతజ్ఞతలు తెలిపారు.

వైట్‌హౌస్ టెంపరరీ లాక్‌డౌన్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ వెలుపల తీవ్ర కలకలం రేగింది. వైట్‌హౌస్ సమీపంలోని లఫాయెట్ స్క్వేర్ వద్ద కారు అదుపుతప్పి అక్కడున్న సమాచార సైన్‌పోస్టును ఢీకొట్టింది. ఈ ఘటనతో అప్రమత్తమైన భద్రతా బలగాలు వైట్‌హౌస్‌ను తాత్కాలికంగా లాక్‌డౌన్ చేశాయి. ప్రమాదం జరిగిన సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లోనే ఉన్నట్లు నివేదికలు వెల్లడించాయి. సోమవారం ఉదయం వాషింగ్టన్ అత్యంత పటిష్ట భద్రతా వలయంలో ఉన్న వైట్‌హౌస్ పరిసరాల్లో ఒక సిల్వర్ రంగు సెడాన్ కారు దూసుకొచ్చింది. లఫాయెట్ స్క్వేర్ ఉత్తర భాగంలో ఉన్న పేవ్‌మెంట్ పైకి కారు దూసుకెళ్లి అక్కడ ఉన్న సైన్‌పోస్టును బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే కారు ముందు భాగం నుంచి తెల్లటి పొగ కమ్ముకున్నాయి. కారును ఢీకొట్టిన తర్వాత డ్రైవర్ కిందకు దిగి భద్రతా సిబ్బందితో వాగ్వాదానికి, భౌతిక దాడికి దిగాడు. అప్రమత్తమైన సీక్రెట్ సర్వీస్ అధికారులు, నేషనల్ గార్డ్ ట్రూప్స్ వెంటనే రంగంలోకి దిగి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ అనూహ్య పరిణామంతో అప్రమత్తమైన యూఎస్ సీక్రెట్ సర్వీస్ అధికారులు భద్రతా చర్యల్లో భాగంగా వైట్‌హౌస్ ప్రెస్ కార్ప్స్‌ను (మీడియా సిబ్బందిని) భవనం లోపలికి వెళ్లి అక్కడే ఉండాలని ఆదేశించారు. అధ్యక్ష భవనం చుట్టుపక్కల ప్రాంతాల్లో రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. అ

జీఎస్ఐలో ఆధునిక వసతులు

నేడు ప్రారంభించనున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. రూ.9.12 కోట్లతో అంతర్జాతీయ వసతి గృహం ఏర్పాటు

హైదరాబాద్, నవంబర్ 9 (పీఐబీ): హైదరాబాద్‌లోని బండ్లగూడ–నాగోల్‌లో ఉన్న భారత భూగర్భ పరిశోధన సంస్థ శిక్షణ కేంద్రం (జీఎస్ఐటీఐ)లో మూడు ఆధునిక వసతులను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించనున్నారు. ఉదయం 9.30 గంటలకు అంతర్జాతీయ వసతి గృహం, అధునాతన భౌగోళిక భౌతిక సమాచార విశ్లేషణ ప్రయోగశాల, డిజిటల్ స్టూడియోలను ప్రారంభిస్తారు. ఈ వసతుల ఏర్పాటుతో సంస్థలో శిక్షణ మౌలిక సదుపాయాలు బలోపేతం కావడంతో పాటు అంతర్జాతీయ శిక్షణ, భూవిజ్ఞాన పరిశోధన, డిజిటల్ విద్యా సామర్థ్యాలు మెరుగుపడనున్నాయి. తొలుత అంతర్జాతీయ వసతి గృహాన్ని ప్రారంభించిన అనంతరం ప్రయోగశాల, డిజిటల్ స్టూడియోలను మంత్రి ప్రారంభిస్తారు. జీఎస్ఐ డైరెక్టర్ జనరల్ దినేష్ వి. గన్వీర్ స్వాగతోపన్యాసం చేస్తారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కిషన్‌రెడ్డి ప్రసంగిస్తారు. గనుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి ఫరీదా ఎం. నాయక్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారు. అంతర్జాతీయ వసతి గృహాన్ని జీఎస్ఐ రూ.4.27 కోట్లతో నిర్మించింది. నలంద, తక్షశిల పేర్లతో ఏర్పాటు చేసిన ఈ వసతి గృహంలో భోజనశాల, వినోద సదుపాయాలు, వ్యాయామశాల, చిన్న గ్రంథాలయం, ఉతికే సదుపాయాలతో పాటు ఆధునిక ఫర్నిచర్‌తో కూడిన 32 గదులు ఉన్నాయి. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సూచనల మేరకు దీనిని అభివృద్ధి చేశారు. విదేశీ శిక్షణార్థులకు సౌకర్యవంతమైన వసతి కల్పించడంతో పాటు అంతర్జాతీయ సంబంధాలు, సాంస్కృతిక మార్పిడి, పరస్పర సహకారానికి ఇది దోహదపడనుంది. అధునాతన భౌగోళిక భౌతిక సమాచార విశ్లేషణ ప్రయోగశాలను జాతీయ ఖనిజ అన్వేషణ, అభివృద్ధి సంస్థ (ఎన్ఎంఈడీటీ), జీఎస్ఐ సంయుక్తంగా రూ.4.55 కోట్లతో ఏర్పాటు చేశాయి. ఇందులో 25 అత్యాధునిక కంప్యూటర్లు, ఆధునిక సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉన్నాయి. ఖనిజ అన్వేషణలో ఉపయోగించే సమాచార విశ్లేషణ, నమూనాల రూపకల్పన, గణనలకు ఈ ప్రయోగశాల ఉపయోగపడుతుంది. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సీబీసీ, జీఎస్ఐ సంయుక్తంగా రూ.30 లక్షలతో డిజిటల్ స్టూడియోను ఏర్పాటు చేశాయి. మిషన్ కర్మయోగిలో భాగంగా ఐజీవోటీ కర్మయోగి వేదిక కోసం వీడియో పాఠాలు, శబ్ద ప్రసార కార్యక్రమాలు, అంతర్జాల



సదస్సులు వంటి నాణ్యమైన డిజిటల్ విద్యా వనరులను రూపొందించేందుకు ఇది ఉపయోగపడుతుంది. 1851లో రైల్వేల అవసరాల కోసం బొగ్గు నిక్షేపాల అన్వేషణ లక్ష్యంగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఏర్పాటైంది. ప్రస్తుతం అంతర్జాతీయ గుర్తింపు పొందిన భూవిజ్ఞాన సంస్థగా ఎదిగింది. భూగర్భ పరిశోధనలు, ఖనిజ అన్వేషణ, ప్రకృతి విపత్తులపై అధ్యయనాలు, జాతీయ భూవిజ్ఞాన సమాచార సేకరణ, నవీకరణ, ఖనిజ వనరుల అంచనా వంటి కీలక బాధ్యతలను నిర్వహిస్తోంది.

వనపర్తి జిల్లాలో 900 ఏళ్ల నాటి శాసనం

వనపర్తి, నవంబర్ 9 (ఈవార్తలు): తెలంగాణ చారిత్రక సంపదలో మరో కీలక ఆధారం వెలుగులోకి వచ్చింది. వనపర్తి జిల్లా, కోటకొండలోని ఒక శివాలయంలో సుమారు 900 ఏళ్ల నాటి పురాతన శాసనాన్ని చరిత్రకారులు గుర్తించారు. ఇది కల్యాణి చాళుక్య చక్రవర్తి ఆరవ విక్రమాదిత్యుడి (త్రిభువనమల్ల దేవుడు) కాలం నాటిదని నిర్ధారించారు. ఇప్పటివరకు ఎవరికీ అంతుచిక్కని ఈ శాసనాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకులు వెలుగులోకి తెచ్చారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు బైరోజు చంద్రశేఖర్, డా. బైరోజు శ్యామ్ సుందర్, హనుమానగరి వేమారెడ్డి, పండ్రప్రగడ రామారావు ఈ శాసనాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేశారు. బృందం అధ్యక్షుడు శ్రీరామోజు హరగోపాల్ దీనిని చదివి చారిత్రక వివరాలను విశ్లేషించారు. ఈ శాసనాన్ని క్రీ.శ. 1118 మే 22న వేసినట్లు గుర్తించారు. ఇది 12వ శతాబ్దపు తెలుగన్నడ లిపిలో, కన్నడ భాషలో ఉంది. శాసనం ప్రకారం, కాలాబోలవిరనోలబ మల్లదేశారెడ్డి అనే అధికారి, కదిరాజ అనే పూజారి పాదాలను కడిగి, సింగణగదనకొలను అనే ప్రాంతంలో 3 మత్తరుల తడి భూమిని దానంగా ఇచ్చినట్లు స్పష్టంగా ఉంది. శాసన స్తంభంపై 'త్రిభువనమల్ల దేవ' అనే పేరు ఉండటంతో ఇది విక్రమాదిత్యుడి కాలం నాటిదని ధ్రువీకరించారు. శిలాఫలకం మరోవైపు 'రామేశ్వర పండిత', 'సూర్యగ్రహణం' అనే పదాలు ఉన్నప్పటికీ, ఆ భాగం కొంత శిథిలమైంది. శ్రీ నాయక అనే మరో అధికారి కూడా భూదానం చేసినట్లు ఇందులో రాశారు. శాసనం ఉన్న స్తంభం మధ్యలో విరిగిపోయి ఉంది. ఇదే ఆలయంలో కాకతీయ శైలిలో ఉన్న చదునైన పానవట్టం (శివలింగం కింది భాగం)తో కూడిన శివలింగం, చాళుక్యుల శైలి నంది, గణపతి విగ్రహాలు, 16వ శతాబ్దానికి చెందిన భక్త ఆంజనేయ విగ్రహం ఉండటం విశేషం. ఈ శాసనం తెలంగాణ ప్రాంతంలో కల్యాణి చాళుక్యుల పాలన, వారి కాలం నాటి భూదానాల సంప్రదాయాలకు బలమైన చారిత్రక సాక్ష్యంగా నిలుస్తుందని పరిశోధకులు తెలిపారు.

లంచం తీసుకుంటూ దొరికిన కీసర ఎస్సై

మల్కాజిగిరి, నవంబర్ 9 (ఈవార్తలు): హైదరాబాద్ లోని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కీసర పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఒక కేసుకు సంబంధించి చార్జ్‌షీట్ దాఖలు చేయడానికి బాధితుడి నుంచి రూ.2 లక్షలు తీసుకుంటుండగా అధికారులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఒక కేసుకు సంబంధించి చార్జ్‌షీట్ వేయాలని బాధితుడు ఎస్సై శ్రీనివాస్‌ను కోరారు. ఇందుకు ప్రతిఫలంగా ఎస్సై రూ.2 లక్షల నగదు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత పెద్ద మొత్తం ఇవ్వలేకపోయిన బాధితుడు చివరకు ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. ఈ ఉదయం శిల్పా నగర్ వద్ద బాధితుడి నుంచి ఎస్సై శ్రీనివాస్ రూ.2 లక్షల నగదును లంచంగా తీసుకుంటుండగా ఏసీబీ బృందం ఆయన్ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఆయన వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకుని, తదుపరి విచారణ చేపట్టారు. కీసర పోలీస్ స్టేషన్‌లో కొద్ది నెలల వ్యవధిలోనే ఇలాంటి అవినీతి ఘటన మరోసారి వెలుగుచూడటం పోలీస్ శాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది. గతంలోనూ స్టేషన్ బెయిల్ కోసం రూ.5 లక్షలు డిమాండ్ చేస్తూ ఇక్కడి ఇన్‌స్పెక్టర్ ఏసీబీకి పట్టుబడిన సంగతి తెలిసిందే. ఆ ఘటన మరువకముందే తాజాగా మరో ఎస్సై లంచం తీసుకుంటూ దొరికిపోవడంతో స్థానికంగా కలకలం రేగింది. పట్టుబడిన ఎస్సై శ్రీనివాస్‌ను ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిస్తేనే అభివృద్ధి: బండి సంజయ్

కరీంనగర్, నవంబర్ 9 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లాలో రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పట్టణాభివృద్ధి (అర్బన్ డెవలప్‌మెంట్) పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో కలిస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. నగరంలో ప్రధాన సమస్యగా మారిన డంప్ యార్డ్ అంశాన్ని త్వరలోనే పరిష్కరిస్తామని, దీనిపై ఎవరూ అనవసర వివాదాలు చేయవద్దని సూచించారు. అభివృద్ధి పనులకు కొందరు కాళ్లల్లో కట్టెలు పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. కాంట్రాక్టర్లను భయపెడితే పనులు కావని, కరీంనగర్ పేరును సర్వనాశనం చేయాలని చూసే నీచ రాజకీయాలకు ఫుల్ స్టాప్ పెట్టాలని హితవు పలికారు. చిల్లర వేషాలు వేస్తే ప్రజలు ఊరుకోరని, పనులను అడ్డుకుంటే తాము చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కరీంనగర్ డంప్ యార్డ్ సమస్య ఇప్పటిది కాదని, దీని పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం సైతం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. తమకు ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత ప్రజా సంక్షేమమే ముఖ్యమని పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో టీటీడీ 2027 క్యాలెండర్లు, డైరీలు

తిరుమల, నవంబర్ 9 (ఈవార్తలు): రాబోయే నూతన సంవత్సరం 2027ను పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భక్తుల కోసం ప్రత్యేక సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ప్రతి ఏటా విశేష ఆదరణ పొందే టీటీడీ డైరీలు, క్యాలెండర్లను భక్తులు ఈసారి తమ ఇళ్ల నుంచే సులభంగా పొందేలా ఆన్‌లైన్ బుకింగ్ విధానాన్ని ప్రారంభించింది. శ్రీవారి భక్తులు టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా 2027 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్లు, డైరీలను నేరుగా ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకోవచ్చని దేవస్థానం అధికారులు వెల్లడించారు. ఆన్‌లైన్ సదుపాయంతో పాటు భక్తుల సౌకర్యార్థం ప్రత్యక్ష విక్రయ కేంద్రాలను కూడా టీటీడీ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచింది.



తిరుపతి, తిరుమల, తిరుచానూరు పరిధిలోని టీటీడీ ప్రచురణల విక్రయ విభాగానికి చెందిన 12 ప్రత్యేక కౌంటర్లలో వీటిని భక్తులు కొనుగోలు చేయవచ్చు. అంతేకాకుండా, తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రధాన నగరాల్లోని భక్తుల కోసం స్థానిక టీటీడీ సమాచార కేంద్రాల్లోనూ వీటి విక్రయాలు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, హిమాయత్‌నగర్ కేంద్రాలతో పాటు విజయవాడ, చెన్నై, వెల్లూరు, బెంగళూరు, న్యూఢిల్లీ, ముంబై నగరాల్లోని టీటీడీ సమాచార కేంద్రాల్లో ఈ క్యాలెండర్లు, డైరీలు లభ్యమవుతున్నాయి. కాగా, 2027 నూతన సంవత్సరానికి సంబంధించిన టీటీడీ డైరీలు, క్యాలెండర్లను 2026 సెప్టెంబరు 7వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఆవిష్కరణ జరిగిన నాటి నుంచే ప్రత్యక్ష కేంద్రాల్లో వీటి విక్రయాలు వేగంగా సాగుతున్నాయి. భక్తుల నుంచి వస్తున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని తాజాగా ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయాన్ని సైతం విస్తృతం చేశారు. శ్రీవారి భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, అధికారిక వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవాలని లేదా సమీపంలోని సమాచార కేంద్రాల వద్ద వీటిని కొనుగోలు చేయాలని టీటీడీ ప్రధాన ప్రజా సంబంధాల అధికారి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

పట్నం నరేందర్‌రెడ్డిది అక్రమ అరెస్టు: కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 9 (ఈవార్తలు): కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పార్టీ కార్యకర్త అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళుతున్న నాయకుడిని పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకోవడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. వికారాబాద్ జిల్లా పరిగి సమీపంలోని బహార్‌పేట్ చౌరస్తా వద్ద పోలీసులు పట్నం నరేందర్‌రెడ్డి వాహనాన్ని అడ్డుకుని ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన కోస్గిలో మరణించిన ఓ బీఆర్ఎస్ కార్యకర్త అంత్యక్రియలకు వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఉన్నందున, ముందస్తు జాగ్రత్త చర్యగానే నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ అరెస్టుతో ఆగ్రహించిన బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసు వాహనాన్ని చుట్టుముట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కేటీఆర్ స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "పరామర్శించేందుకు వెళుతున్న నాయకుడిని అరెస్టు చేయాల్సిన అవసరం ఏముంది? బాధిత కుటుంబానికి అండగా నిలవడం కూడా ఇందిరమ్మ రాజ్యంలో నేరమైందా? నిర్బంధాలతో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేయడమే కాంగ్రెస్ పార్టీ పాలనగా మారుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు బీఆర్ఎస్ ఏమాత్రం భయపడదు. ప్రజల, కార్యకర్తల పక్షాన పోరాటం కొనసాగుతుంది. పట్నం నరేందర్‌రెడ్డిని ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలి" అని డిమాండ్ చేశారు. మరోవైపు, పట్నం అరెస్టును సబితా ఇంద్రారెడ్డి కూడా ఖండించారు. ప్రతిపక్ష నేతలను అకారణంగా నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని పార్టీ నేతలు స్పష్టం చేశారు.

ఏపీ ఉద్యోగులకు ఓపీఎస్

అమరావతి, నవంబర్ 9 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పరిధిలోని అర్హులైన ఉద్యోగులు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)లోకి మారేందుకు అవసరమైన సమగ్ర విధివిధానాలను ఖరారు చేస్తూ ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నంబర్ 158ను జారీ చేసింది. అర్హత కలిగిన ఉద్యోగులు ఒకేసారి తమ ఆప్షన్ (వన్-టైమ్ ఆప్షన్) నమోదు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం మార్గదర్శకాలను అధికారికంగా విడుదల చేసింది. ఈ నిర్ణయంతో 2004 సెప్టెంబర్ 1కి ముందు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదలై, ఆ తేదీ తర్వాత విధుల్లో చేరిన ఉద్యోగులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం సర్వీసులో ఉన్నవారితో పాటు, అప్పటికే పదవీ విరమణ పొందినవారు, మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కూడా ఈ వెసులుబాటు వర్తిస్తుంది. దాదాపు 10,715 మంది ఉద్యోగులు, వారి కుటుంబాలకు దీనివల్ల లబ్ధి చేకూరనుంది. ఓపీఎస్‌కు మారాలనుకునే అర్హులు 2026 డిసెంబర్ 31వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా తమ ఆప్షన్ నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

తెలంగాణలో 'మీ బావి' ఉద్యమం

బావుల పునరుద్ధరణకు పిడికిలి

హైదరాబాద్, నవంబర్ 9 (ఈవార్తలు): రాష్ట్రంలో తీవ్రమవుతున్న నీటి సంక్షోభం, వేగంగా అడుగంటుతున్న భూగర్భ జలాల సమస్యను అధిగమించేందుకు హైదరాబాద్ నగరానికి చెందిన వారసత్వ పరిరక్షణ సంస్థ "అకర్మా" నడుం బిగించింది. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న వందలాది చారిత్రక బావులను పరిరక్షించి, పునరుద్ధరించే లక్ష్యంతో "మీ బావి" పేరుతో ఓ ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. నిర్లక్ష్యానికి గురైన ఈ వారసత్వ కట్టడాలకు చట్టపరమైన రక్షణ కల్పించి, వాటిని క్రియాశీల జల వనరులుగా, భూగర్భ జల రీఛార్జ్ వ్యవస్థలుగా మార్చడమే ఈ ఉద్యమం ప్రధాన ఉద్దేశం. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నీటి ఎద్దడి రోజురోజుకు తీవ్రమవుతోంది. ముఖ్యంగా "సూపర్ ఎల్ నినో" ప్రభావంతో ఈ సమస్య మరింత జఠిలంగా మారిందని అకర్మా సంస్థ విశ్లేషిస్తోంది. ఈ నేపథ్యంలో, సాంప్రదాయ నీటి నిల్వ పద్ధతులైన బావులను పునరుజ్జీవింపజేయడం ద్వారా సుస్థిర పరిష్కారం కనుగొనవచ్చని సంస్థ భావిస్తోంది. కేవలం బావులను బాగుచేయడమే కాకుండా, ప్రభుత్వ విధానాల్లో మార్పులు తీసుకురావడం, ప్రజలు, ఇతర భాగస్వాములను ఇందులో కలుపుకొనిపోవడం ద్వారా శాశ్వత ఫలితాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే తాము పరిరక్షించిన కొన్ని బావుల ద్వారా ఏటా 500 లక్షల లీటర్లకు పైగా నీరు భూమిలోకి ఇంకి, భూగర్భ జలమట్టం పెరగడానికి దోహదపడుతోందని అకర్మా సంస్థ ప్రతినిధులు



తెలిపారు. నీటిని కేవలం వినియోగ వస్తువుగా కాకుండా, అందరి ఉమ్మడి వారసత్వ సంపదగా చూడాలని, దాని సంరక్షణను సామాజిక బాధ్యతగా స్వీకరించాలని ఈ ఉద్యమం పిలుపునిస్తోంది. ఈ ఉద్యమంలో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నవంబర్ 13న సాయంత్రం 4:30 గంటలకు బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కులో బావుల పరిరక్షణపై ఓ ప్రత్యేక చర్చాగోష్ఠి ఏర్పాటు చేశారు. దీంతో పాటు, కేబీఆర్ పార్కుతో పాటు ఇతర ప్రజా ప్రదేశాలలో చారిత్రక బావుల ఛాయాచిత్ర ప్రదర్శనను కూడా నిర్వహించనున్నారు. తద్వారా సాంప్రదాయ నీటి నిల్వ సాంకేతికత ప్రాముఖ్యతను ప్రజలకు వివరించనున్నారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

ఈవార్తలు
COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

Position	B&W Rate	Colour Rate
Front Page	Rs.550	Rs.1,000
Page 3 / Back Page	Rs.350	Rs.750
Inside Pages	Rs.250	Rs.500

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE:
Price for 5 Lines – Rs.450
(for each extra line – Rs.90)

COLOUR:
Price for 5 Lines – Rs.500
(for each extra line – Rs.100)

Phone: +91 94404 55811 Email: contact@evarthalu.com

కొండగట్టు చందనోత్సవ ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ

దివ్యాంగ భక్తుల కోసం రూ.5 లక్షలతో విద్యుత్ వాహనం ప్రారంభం



హుస్నాబాద్/మల్యాల, నవంబర్ 9 (ఈవార్తలు): కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న చందనోత్సవం, మహా సంప్రోక్షణ ఉత్సవాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికలు, ఆహ్వాన పత్రికలు, కరపత్రాలను ఆవిష్కరించారు. భక్తుల సౌకర్యార్థం, ముఖ్యంగా దివ్యాంగులు ఆలయ ప్రాంగణంలో సులభంగా రాకపోకలు సాగించేందుకు విద్యుత్ వాహనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ వాహనం కొనుగోలుకు దేవస్థానం తరఫున రూ.3 లక్షలు, దాతలైన కరీంనగర్‌కు చెందిన మారుతి ఎస్.ఆర్. డైరీ తరఫున రూ.2 లక్షలు.. మొత్తం రూ.5 లక్షలు వెచ్చించారు. అనంతరం హుస్నాబాద్‌లోని తన శిబిర కార్యాలయంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఎమ్మెల్యే కలిసి కొండగట్టు చందనోత్సవానికి హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి అంజనా రెడ్డి, గ్రామ సర్పంచ్ ఆదిరెడ్డి, స్థానాచార్యులు కపిందర్, ఆలయ సూపరింటెండెంట్ సునీల్ కుమార్, బత్తిని శ్రీనివాస్, కమలాకర్ రెడ్డి, ముత్యం శంకర్, రాజనర్సింగరావు, నక్క అనిల్, అజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి అరెకపూడి గాంధీ సాయం

కూకట్‌పల్లి, నవంబర్ 9 (ఈవార్తలు): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇస్త్రీ దుకాణం దగ్ధమై జీవనాధారం కోల్పోయిన నిరుపేద కుటుంబానికి ప్రజాప్రతినిధులు అండగా నిలిచారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఈస్ట్ సాయినగర్‌కు చెందిన చంద్రయ్యకు ఇస్త్రీ పెట్టె, బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సహకారంతో తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ సమక్షంలో పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ బాధితుడికి ఈ సహాయాన్ని అందించారు. సహాయం అందించిన గాంధీ, వెంకటేష్ గౌడ్‌లకు చంద్రయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారబోయిన రాజు యాదవ్, మరేళ్ల శ్రీనివాస్, ఎండీ ఇబ్రహీం, శేఖర్, మంజుల, అష్రఫ్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి

జగిత్యాల కలెక్టర్‌కు ఎమ్మెల్యే సంజయ్ వినతి

జగిత్యాల, నవంబర్ 9 (ఈవార్తలు): వానాకాలం వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో రైతుల సౌకర్యార్థం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌ను కోరారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే వరి కోతలు మొదలయ్యాయని, రైతులు మధ్యవర్తుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల ద్వారానే ధాన్యం విక్రయించుకునేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులతో మాట్లాడి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

యోగా ప్రాంగణానికి మౌలిక వసతులు కల్పించాలి

ఎమ్మెల్యే గాంధీ, జోనల్ కమిషనర్‌కు యోగాభ్యాసకుల వినతి



కూకట్‌పల్లి, నవంబర్ 9 (ఈవార్తలు): పీజేఆర్ స్టేడియంలోని యోగా ప్రాంగణంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ యోగాభ్యాసకులు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ్‌లకు వినతిపత్రాలు అందజేశారు. యోగా శిక్షకులు పుట్ట వినయ్ కుమార్ గౌడ్, జగన్నాథం ప్రాంగణంలో ఎదురవుతున్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. గత 12 ఏళ్లుగా ఇక్కడ ఉచితంగా యోగా తరగతులు నిర్వహిస్తున్నామని, వర్షాకాలం, చలికాలంలో కనీస వసతులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రాంగణానికి పైకప్పు, మూడు అడుగుల ఎత్తులో ప్రహరీ, యోగా పరికరాల భద్రత కోసం రెండు గదులు, గాలి, వెలుతురు కోసం మెష్ ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపై స్పందించిన ఎమ్మెల్యే గాంధీ ఈ నెల 11న జోనల్ కమిషనర్, సంబంధిత అధికారులతో కలిసి స్టేడియాన్ని సందర్శించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో యోగాభ్యాసకులు ఎమ్మెల్యేను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు రెడ్డి రఘునాథ్ రెడ్డి, యోగాభ్యాసకులు అప్పలనాయుడు, శ్రీనివాసరావు, మహిపాల్ రెడ్డి, పద్మ, సింహాచలం, సురేష్, శంకర్ పటేల్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీ సంప్రదాయాలకు అద్దం పట్టిన దీపావళి

రాయికల్, నవంబర్ 9 (ఈవార్తలు): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా రాయికల్ మండలం జగన్నాథ్‌పూర్‌లో గోండు ఆదివాసీలు హేత్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి గుస్సాడి దండారి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. సంప్రదాయ దుస్తులు, నెమలి ఈకల అలంకరణలు, డప్పుల మోతలతో సాగిన గుస్సాడి నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హైదరాబాద్‌కు చెందిన నేను సైతం ఛాయాచిత్ర ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత రామకృష్ణ చారి ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం ఉత్సవాల్లో పాల్గొంది. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను అభినందిస్తూ సర్పంచ్ పరచ శంకర్, గ్రామ పెద్దలను సన్మానించింది. తరతరాలుగా వస్తున్న ఆచారాలను కొనసాగిస్తున్నామని, ఆదివాసీ సంప్రదాయాలకు ప్రభుత్వం గుర్తింపు ఇచ్చి ఉత్సవాలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సర్పంచ్ కోరారు. ఆదివాసీ సంస్కృతిని భావితరాలకు అందించడం అందరి బాధ్యతని ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కె. ప్రభాకర్ రెడ్డి, ఇరుకుల వీరేశం, దురిశెట్టి శ్రీనివాస్, ఇంద్రారెడ్డి, మ్యాన మనోహర్, తూర్పాటి సత్యనారాయణ, వడ్లూరి రవీందర్, సర్పంచ్ వెంకటేష్, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



వాల్మీకి ఆవాసంలో అన్నదానం

జగిత్యాల, నవంబర్ 9 (ఈవార్తలు): ప్రముఖ వ్యాపారవేత్త, ఎల్.జి. రామ్ హెల్త్ కేర్ అండ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు ఎల్.జి. రామ్, ఆయన అల్లుడు పోరండ్ల ప్రభాకర్ జయంతి సందర్భంగా పట్టణంలోని వాల్మీకి ఆవాసంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు భోజనం అందించడంతో పాటు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ ఎల్. రమణ తండ్రి, బావ జయంతిని పురస్కరించుకుని ఆవాసంలోని విద్యార్థులకు ఒకరోజు భోజన ఖర్చును అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎల్.జి. రామ్ సొసైటీ ద్వారా వేలాది కుటుంబాలకు ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. టాక్సీ డ్రైవర్లకు బీమా, వైద్య శిబిరాలు, రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవలందిస్తున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎల్. శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అయిల్నేని వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ కోరుకంటి రాము, నాయకులు వొల్లెం మల్లేశం, వొల్లాల గంగాధర్, వనమాల నిరంజన్, కుడిక్యాల సర్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో భారీ చోరీ.. నిందితుడి అరెస్ట్

కూకట్‌పల్లి, నవంబర్ 9 (ఈవార్తలు): కొండాపూర్ శిల్పావ్యాలీలోని సారా ప్రైడ్ అపార్ట్‌మెంట్‌లో భారీ చోరీకి పాల్పడిన నిందితుడిని గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 35 తులాల బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 2వ తేదీ రాత్రి ఫ్లాట్‌లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన లిమ్మక అనంత్ కుమార్ (28) టెర్రస్‌పై నుంచి తాడు సహాయంతో బాల్కనీలోకి ప్రవేశించాడు. అనంతరం స్లైడింగ్ డోర్, అల్మారాను ధ్వంసం చేసి బంగారు, వెండి ఆభరణాలను అపహరించాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 8న గచ్చిబౌలి ఎక్స్‌రోడ్స్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. చోరీ సొత్తుతో పాటు హోండా యాక్టివా, మొబైల్ ఫోన్, రెండు సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటుపడి ఆర్థిక అవసరాల కోసం చోరీకి పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. డీసీపీ సీహెచ్. శ్రీనివాస్ పర్యవేక్షణలో గచ్చిబౌలి పోలీసులు కేసును ఛేదించారు.



గ్రామాల అభివృద్ధికి కేంద్రం అండ: భోగ శ్రావణి

జగిత్యాల, నవంబర్ 9 (ఈవార్తలు): జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో కమ్యూనిటీ హాల్, మోతే రెడ్డి సంఘ భవన నిర్మాణానికి ఎంపీ లాడ్స్ నిధులు మంజూరయ్యాయి. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ మంజూరు చేసిన నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ ప్రతులను సోమవారం బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ భోగ శ్రావణి గ్రామస్థులు, సంఘ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర నిధులు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. నిధులు మంజూరు చేసిన ఎంపీ ధర్మపురి అరవింద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ మండల అధ్యక్షుడు రామ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మ్యాదారి అశోక్, పట్టణ అధ్యక్షుడు కాశెట్టి తిరుపతి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నరపాక అశోక్, నాయకులు తిరుపతి, దానపనేని నరేష్, సల్ల రమేష్, ఇట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

VANGS GLOBAL TECHNOLOGIES LLP

DASARA SPECIAL OFFER

Launch Your Cloud-Hosted ePaper Today

Powering modern newsrooms with AI-powered image extraction & multi-language support

ePaper Pro దసరా శుభాకాంక్షలు

20% OFF ON EVERY PLAN

NEWS ONLY website · web stories · breaking news

Standard 5 GB · 5 users — SAVE 20%
- ✓ Automatic PDF extraction
- ✓ Custom domain & push alerts
- ✓ Web stories, gallery, headlines
- ✓ Country & device-wise views

₹8,124 ₹6,499
20% OFF · SAVE ₹1,625 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Web stories, gallery, headlines

₹12,499 ₹9,999
20% OFF · SAVE ₹2,500 / YEAR

Full Press 15 GB · 30 users — SAVE 20%
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Web stories, gallery, headlines

₹16,249 ₹12,999
20% OFF · SAVE ₹3,250 / YEAR

ePAPER ONLY PDF to Interactive ePaper

Standard 5 GB · 5 users — SAVE 20%
- ✓ Automatic PDF extraction
- ✓ Custom domain & push alerts
- ✓ Unlimited pageviews & SEO
- ✓ Country & device-wise views

₹9,999 ₹7,999
20% OFF · SAVE ₹2,000 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
- ✓ Android app & email support
- ✓ Drag & drop theme builder
- ✓ Employee ID card design
- ✓ Custom domain & push alerts

₹14,999 ₹11,999
20% OFF · SAVE ₹3,000 / YEAR

Full Press 15 GB · 30 users — SAVE 20%
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Custom domain & push alerts

₹19,999 ₹15,999
20% OFF · SAVE ₹4,000 / YEAR

NEWS + ePAPER the complete digital newspaper

Standard 5 GB · 5 users — SAVE 20%
- ✓ Automatic PDF extraction
- ✓ Custom domain & push alerts
- ✓ Web stories, gallery, headlines
- ✓ Country & device-wise views

₹17,499 ₹13,999
20% OFF · SAVE ₹3,500 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Web stories, gallery, headlines

₹22,499 ₹17,999
20% OFF · SAVE ₹4,500 / YEAR

Full Press 15 GB · 30 users — BEST VALUE
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Web stories, gallery, headlines

₹32,499 ₹25,999
20% OFF · SAVE ₹4,500 / YEAR

PLATFORM HIGHLIGHTS
- Smart AI image extraction
- AdSense & sponsor ad slots
- Custom domain + auto SSL
- One-click publishing
- WhatsApp sharing
- AI tagging & SEO tags
- Real-time analytics
- AWS cloud - daily backups
- YouTube Video embedding

Try free for 12 days
No credit card required - Turn your print edition into a digital publication

CALL / WHATSAPP +91 7675087378
EMAIL hr@vangstechnologies.com
WEBSITE www.vangstechnologies.com

SCAN TO VISIT OUR WEBSITE
SCAN TO CALL +91 7675087378

భారత్ పేద దేశం కాదు!

పదేళ్లలోనే పెను మార్పు.. 27.1 శాతం నుంచి 2.6 శాతానికి తగ్గిన పేదలు

తీవ్ర పేదరికం నుంచి బయటపడిన 49.6 కోట్ల మంది.. భారత్ పురోగతిని ప్రశంసించిన ప్రపంచ బ్యాంకు

న్యూఢిల్లీ: భారత్‌లో గత దశాబ్ద కాలంలో పేదరికం గణనీయంగా తగ్గిందని ప్రపంచ బ్యాంకు ప్రశంసించింది. ఈ విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు భారత్ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవచ్చని ఓ నివేదిక వెల్లడించింది. 2011లో దేశంలో అత్యంత పేదరికంలో ఉన్నవారి సంఖ్య 27.1 శాతంగా ఉండగా.. 2023 నాటికి అది 2.6 శాతానికి తగ్గినట్లు ప్రపంచ బ్యాంకు గణాంకాలు చెబుతున్నాయి. 'ది బిజినెస్ స్టాండర్డ్' ప్రచురించిన నివేదిక ప్రకారం.. భారత్ దాదాపు 49.6 కోట్ల మందిని తీవ్ర పేదరికం నుంచి బయటపడేసింది. అమెరికా, రష్యా దేశాల మొత్తం జనాభా కంటే ఇది ఎక్కువ. ప్రపంచంలో పేదరికం అత్యంత వేగంగా తగ్గిన దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచిందని నివేదిక పేర్కొంది. రోజుకు 4.2 డాలర్ల ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకునే దిగువ మధ్య ఆదాయ దేశాల పేదరిక ప్రమాణం ప్రకారం కూడా భారత్‌లో పేదరికం 2011లో 57.7 శాతం ఉండగా.. 2023 నాటికి 16.1 శాతానికి తగ్గింది. అయితే పేదరికాన్ని కొలిచే విధానాల్లో వచ్చిన మార్పులు కూడా ఈ గణాంకాలపై కొంత ప్రభావం చూపి ఉండొచ్చని ప్రపంచ బ్యాంకు స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా పేదరికం తగ్గుదల ఒకేలా లేదని నివేదిక తెలిపింది. ఉత్తరప్రదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్ వరకు ఉన్న ప్రాంతంలోనే దేశంలోని పేదల్లో 57 శాతం మంది నివసిస్తున్నట్లు వెల్లడించింది. పేదరికం తగ్గడానికి ప్రధానంగా ఆర్థిక వృద్ధి, వినియోగం పెరగడం, ఉపాధి అవకాశాలు విస్తరించడం, సామాజిక భద్రతా పథకాలు దోహదపడ్డాయని నివేదిక వివరించింది. 2022-25 మధ్య భారత్ సగటున ఏటా 7 శాతానికి పైగా ఆర్థిక వృద్ధిని నమోదు చేసింది. 2015లో 1.24 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్న కుటుంబాల ఖర్చు 2025 నాటికి 2.24 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. మహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడం కూడా పేదరికం తగ్గుదలకు తోడ్పడింది. 2014-24 మధ్య దేశంలో 17 కోట్లకు పైగా ఉద్యోగాలు కల్పించినట్లు నివేదిక పేర్కొంది. సగటున



ఏటా 1.7 కోట్ల ఉద్యోగాలు వచ్చాయి. నిరుద్యోగిత రేటు 2015లో 7.6 శాతంగా ఉండగా.. 2025 నాటికి 4.2 శాతానికి తగ్గింది. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో డిజిటల్ విధానాల విస్తరణ, మహిళా కేంద్రిత పథకాలు, వ్యవసాయం, గ్రామీణ రంగాలకు మద్దతు, సామాజిక భద్రతా కార్యక్రమాల విస్తరణ కూడా పేదరిక నిర్మూలనలో కీలక పాత్ర పోషించాయని నివేదిక వివరించింది.

పాస్‌పోర్టు ఇవ్వండి.. ఉగ్రవాదులకు ఇవ్వం

తిరిగెళ్లేందుకు షేక్ హసీనా దరఖాస్తు.. ఇవ్వడం కుదరదన్న బంగ్లాదేశ్

ఢాకా: భారత్‌లో ఉంటున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా తిరిగి స్వదేశానికి వెళ్లేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు చేరుకోవాలన్న లక్ష్యంతో కొత్త పాస్‌పోర్టు, జాతీయ గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ఢిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయానికి ఆమె తరపు న్యాయవాదులు లేఖ రాశారు. అయితే హసీనాను స్వదేశానికి రప్పించేందుకు పాస్‌పోర్టు అవసరం లేదని, భారత్ ఆమెను అప్పగించాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం పట్టుబడుతోంది. దీంతో ఈ వ్యవహారం మరోసారి ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన చర్చకు దారితీసింది. రాయిటర్స్ కథనం ప్రకారం.. హసీనా తరపు న్యాయవాదులు సోమవారం ఢిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయానికి లేఖ పంపారు. గతంలో ఆమె పాస్‌పోర్టు, జాతీయ గుర్తింపు కార్డులను బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం రద్దు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొత్త పత్రాలు జారీ చేయాలని కోరారు. వీలైనంత త్వరగా దరఖాస్తును పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఆమె దరఖాస్తును బంగ్లాదేశ్ ప్రభుత్వం సోమవారం తిరస్కరించింది. ఆమె కొత్త పాస్‌పోర్ట్ కోరడాన్ని ఒక 'డ్రామా' అంటూ బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి హుమాయున్ కబీర్ కొట్టిపారేశారు. ఉగ్రవాదులకు బంగ్లాదేశ్ ప్రభుత్వం పాస్‌పోర్ట్‌లు జారీ చేయదని స్పష్టం చేశారు. అంతేకాకుండా, ఆమెను వెంటనే బంగ్లాదేశ్‌కు అప్పగించాలని భారత్‌ను కోరారు. ఆగస్టు 2024లో బంగ్లాదేశ్ నుంచి పారిపోయి వచ్చిన హసీనా.. గత రెండున్నరేళ్లుగా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. "ఆమె దేశం విడిచి పారిపోయారు... ఇప్పుడు కొత్త పాస్‌పోర్ట్‌తో తిరిగి రావడం గురించి ఇలాంటి నాటకాలు ఆడటానికి ఎలాంటి ఆస్కారం లేదు. ఆమె నిజంగానే దేశానికి తిరిగి రావాలనుకుంటే, దానికి నిర్దిష్టమైన న్యాయపరమైన ప్రక్రియ ఉంది. బంగ్లాదేశ్, భారత్ మధ్య అప్పగింత ఒప్పందం ఉంది. ఆ ఒప్పందం కింద తనను బంగ్లాదేశ్‌కు అప్పగించాలని ఆమె భారత ప్రభుత్వాన్ని కోరవచ్చు. అప్పుడు ఆమె తిరిగి వచ్చి, కోర్టు ముందు లొంగిపోయి తన శిక్షను అనుభవించవచ్చు" అని కబీర్ పేర్కొన్నారు.

జనవరిలో 5 రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్!

యూపీ, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్, మణిపూర్‌లలో జరగనున్న ఎన్నికలు

షెడ్యూల్ ప్రకటనకు ముందు రాష్ట్రాల్లో పర్యటించనున్న ఈసీ పూర్తిస్థాయి బెంచ్

యూపీలో పలు దశల్లో, మిగతా రాష్ట్రాల్లో ఒకే విడతలో పోలింగ్ అంచనా

ఇప్పటికే మూడు రాష్ట్రాల్లో డిప్యూటీ కమిషనర్ల స్థాయి పర్యటనలు పూర్తి



న్యూఢిల్లీ: దేశంలో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తూ, ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కసరత్తును ముమ్మరం చేసింది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను రానున్న జనవరిలో ప్రకటించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ ప్రకటనకు ముందు, ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో ఈసీ పూర్తిస్థాయి బెంచ్ పర్యటించనుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు కమిషనర్లతో కూడిన ఈ పూర్తిస్థాయి బెంచ్, నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్‌లో తమ పర్యటనలను ప్రారంభించే అవకాశం ఉంది. ఈ పర్యటనల సందర్భంగా రాష్ట్రాల క్షేత్రస్థాయి పరిస్థితులను, ఎన్నికల సన్నద్ధతను సమీక్షిస్తారు. రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డీజీపీలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులతో ఈసీ ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలను స్వీకరిస్తుంది. ఇప్పటికే డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ (డీఈసీ) స్థాయి బృందాలు పలు రాష్ట్రాల్లో పర్యటించి సన్నాహక పనులను సమీక్షించాయి. పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్ రాష్ట్రాల్లో ఈ బృందాల పర్యటనలు పూర్తయ్యాయి. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో ఒక దఫా పర్యటన ముగియగా, మరో రెండు పర్యటనలు జరగాల్సి ఉంది. గోవాలో డీఈసీ బృందం ఇంకా పర్యటించలేదు. నవంబర్ నెలాఖరు నాటికి ఈ బృందాలు తమ నివేదికలను ఎన్నికల సంఘానికి సమర్పించనున్నాయి. పోలింగ్‌ను ఎన్ని దశల్లో నిర్వహించాలనే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి చర్చ జరగలేదని తెలుస్తోంది. అయితే, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్ వంటి చిన్న రాష్ట్రాల్లో ఒకే దశలో పోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. జనాభా పరంగా, భౌగోళికంగా పెద్దదైన ఉత్తరప్రదేశ్‌లో మాత్రం బహుళ దశల్లో ఎన్నికలు నిర్వహించే సూచనలు బలంగా కనిపిస్తున్నాయి. రాష్ట్రాల్లో పరిస్థితులు, భద్రతా ఏర్పాట్లు, అధికారుల అభిప్రాయాలను సమగ్రంగా విశ్లేషించిన తర్వాత, షెడ్యూల్ పై ఈసీ తుది నిర్ణయం తీసుకోనుంది.

ఎస్సైని కొట్టి చంపిన యువకులు

తేని: తమిళనాడులోని తేని జిల్లాలో విధి నిర్వహణలో ఉన్న స్పెషల్ సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) సెంథిల్ కుమార్ దారుణ హత్యకు గురికావడం తీవ్ర కలకలం రేపింది. దీపావళి వేడుకల సమయంలో మద్యం మత్తులో ఉన్న కొందరు యువకులు చేసిన దాడిలో ప్రాణాలు కోల్పోయిన ఆయన కుటుంబానికి తమిళనాడు ప్రభుత్వం రూ.40 లక్షల ఆర్థిక సాయం ప్రకటించింది. ఈ విషాద ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. బాధితుడి కుటుంబ సభ్యులకు, బంధువులకు మరియు సహచర పోలీసు సిబ్బందికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అధికారి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు. తేని జిల్లాలోని సమాధర్మపురం ప్రాంతంలో ఆదివారం రాత్రి ఈ దారుణం చోటుచేసుకుంది. స్థానిక యువకులు కొందరు ప్రధాన రహదారిని అడ్డుకుని, విచ్చలవిడిగా బాణసంచా కాలుస్తూ సోషల్ మీడియా రీల్స్ చిత్రీకరిస్తున్నారు. దీంతో అటుగా వెళ్లే పాదచారులకు, వాహనదారులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. అదే సమయంలో అటుగా వెళుతున్న ఎస్సై సెంథిల్ కుమార్ ఆ దృశ్యాన్ని గమనించి వెంటనే జోక్యం చేసుకున్నారు. ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించకుండా పండుగ జరుపుకోవాలని ఆ యువకులకు సూచించారు. అయితే, సెంథిల్ కుమార్ హెచ్చరికలను ఆ యువకులు ఏమాత్రం పట్టించుకోలేదు. మరింత నిర్లక్ష్యంగా రోడ్డుపైనే టపాసులు కాలుస్తూ రచ్చ కొనసాగించారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న విషయాన్ని డాక్యుమెంట్ చేసేందుకు సెంథిల్ కుమార్ తన మొబైల్ ఫోన్‌లో వారి చర్యలను వీడియో తీయడం ప్రారంభించారు. ఇది చూసి ఆగ్రహానికి గురైన ఆ యువకులు ఒక్కసారిగా ఆయనపై దాడికి తెగబడ్డారు. మద్యం, ఇతర మత్తు పదార్థాల ప్రభావంలో ఉన్న ఆ ముఠా ఎస్సైపై తీవ్రస్థాయిలో దాడి చేసింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సెంథిల్ కుమార్ ఘటనా స్థలంలోనే కుప్పకూలిపోయారు. స్థానికులు వెంటనే ఆయనను సమీపంలోని ఆసుపత్రికి తరలించినప్పటికీ, మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న వెంటనే తేని ఎస్పీ ప్రవీణ్ గౌతమ్ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తును పర్యవేక్షించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి ఆధారాలు సేకరించారు.



స్టాక్ మార్కెట్‌కు బూస్ట్

దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం ఒడుదొడుకుల మధ్య స్వల్ప లాభాలతో ముగిశాయి. గత వారం భారీ ర్యాలీ తర్వాత మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో సూచీల్లో పెద్దగా పెరుగుదల కనిపించలేదు. ఐటీ, మెటల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఉన్నప్పటికీ.. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఫార్మా, ఆర్థిక రంగ షేర్లలో కొనుగోళ్లు మార్కెట్లకు అండగా నిలిచాయి. ఫలితంగా సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో స్థిరపడ్డాయి. సెన్సెక్స్ 107.25 పాయింట్లు పెరిగి 81,106.65 వద్ద ముగిసింది. నిఫ్టీ 58.25 పాయింట్లు లాభపడి 25,044.65 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ ప్రారంభంలో సెన్సెక్స్ 81,327 పాయింట్లకు చేరింది. ఇంట్రాడేలో 80,519 పాయింట్ల కనిష్ఠాన్ని తాకింది. నిఫ్టీ సైతం 25,084 పాయింట్ల గరిష్ఠం, 24,838 పాయింట్ల కనిష్ఠం మధ్య కదలాడింది. రంగాలవారీగా చూస్తే ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు దూసుకెళ్లాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీ 3.25 శాతం పెరిగి అగ్రస్థానంలో నిలిచింది. ఫార్మా సూచీ 1.51 శాతం, హెల్త్‌కేర్ 1.11 శాతం లాభపడ్డాయి. ప్రైవేట్ బ్యాంక్ సూచీ 0.53 శాతం పెరిగింది. మరోవైపు ఐటీ సూచీ 1.56 శాతం, మెటల్ సూచీ 0.49 శాతం నష్టపోయాయి. ఎఫ్ఎంసీజీ సూచీ కూడా 0.36 శాతం తగ్గింది. సెన్సెక్స్ షేర్లలో ఎస్‌బీఐ అత్యధికంగా 2.43 శాతం లాభపడింది. ట్రెంట్ 2.13 శాతం, ఎల్‌అండ్‌టీ 1.96 శాతం, ఎన్‌టీపీసీ 1.59 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.52 శాతం పెరిగాయి. మరోవైపు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 2.49 శాతం పడిపోయింది. టాటా స్టీల్ 2.43 శాతం, అల్ట్రాటెక్ సిమెంట్ 2 శాతం, బజాజ్ ఫైనాన్స్ 1.83% నష్టపోయాయి. మార్కెట్ల ఒడుదొడుకులను సూచించే ఇండియా విక్స్ 5.11 శాతం తగ్గి 17.49కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలూ దిగొచ్చాయి. డబ్ల్యూటీఐ బ్యారెల్ ధర 90.39 డాలర్లకు, బ్రెంట్ ధర 97.42 డాలర్లకు తగ్గింది. రానున్న రోజుల్లో భారత్, అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు, ముడిచమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలు మార్కెట్లకు కీలకం కానున్నాయి.

ఢిల్లీని కమ్మేసిన విషవాయువులు

పలు ప్రాంతాల్లో 400 దాటిన ఏక్యూఐ

కాలుష్య డేటాపై బీజేపీ, విపక్షాల ఫైట్!

25 పర్యవేక్షణ కేంద్రాల్లో పీఎం2.5 డేటా గల్లంతు

న్యూఢిల్లీ: దీపావళి వేడుకల తర్వాత దేశ రాజధాని ఢిల్లీ విషవాయువులతో ఉక్కిరిబిక్కిరవుతోంది. నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్మేయడంతో పలు ప్రాంతాల్లో గాలి నాణ్యత తీవ్ర స్థాయికి పడిపోయింది. ఈ పరిస్థితిపై అధికార బీజేపీ, విపక్ష కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మధ్య మాటల యుద్ధం మొదలైంది. కాలుష్య తీవ్రతను ప్రభుత్వం తక్కువ చేసి చూపిస్తోందని విపక్షాలు ఆరోపిస్తుండగా.. 25 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్, ఆప్ చేసిందేమీ లేదని బీజేపీ ఎదురుదాడికి దిగింది. ఆదివారం రాత్రి 11.05 గంటలకు ఢిల్లీ నగటు గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 373గా నమోదైంది. అలీపూర్, బవానా, బురారీ, చాందినీ చౌక్, ముండ్కా, పంజాబీ బాగ్, రోహిణి, వివేక్ విహార్ ప్రాంతాల్లో ఏక్యూఐ 400 దాటింది. పలు ప్రాంతాల్లో దట్టమైన పొగ కారణంగా వాహనదారులకు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. కాలుష్యాన్ని కొలిచే పర్యవేక్షణ కేంద్రాలు కీలక సమయంలో డేటా చూపకపోవడంపై కాంగ్రెస్ నేత పవన్ ఖేరా అనుమానాలు వ్యక్తం చేశారు. ఢిల్లీలోని 39 కేంద్రాల్లో 25 చోట్ల నవంబర్ 9 తెల్లవారుజామున 2 నుంచి 3 గంటల మధ్య పీఎం2.5 వివరాలు అందుబాటులో లేవని పేర్కొన్నారు. కాలుష్య గణాంకాలను ప్రభుత్వం కావాలనే దాచిపెడుతోందా? పరికరాల సామర్థ్యాన్ని మించిన స్థాయిలో కాలుష్యం నమోదైందా? అని ప్రశ్నించారు. డేటా కనిపించకపోవడం వల్ల కాలుష్యం మాయమైపోదని వ్యాఖ్యానించారు. ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ కూడా ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. దీపావళి రాత్రి కొన్ని ప్రాంతాల్లో ఏక్యూఐ 3,000 దాటిందని ఓ వీడియోను ప్రస్తావించారు. మరోవైపు బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ విపక్షాల ఆరోపణలను తప్పుబట్టారు. కాంగ్రెస్ 15 ఏళ్లు, ఆప్ 10 ఏళ్లు ఢిల్లీని పాలించినా కాలుష్య నియంత్రణకు తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. హిందూ పండుగలు వచ్చినప్పుడే విపక్షాలు కాలుష్యాన్ని ప్రస్తావిస్తున్నాయని ఆరోపించారు.







‘అలియాస్ రుక్మిణి’ షూటింగ్ కంప్లీట్

నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా వినోదాత్మక చిత్రం ‘అలియాస్ రుక్మిణి’ షూటింగ్ విజయవంతంగా పూర్తయింది. మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ మొత్తం ముగిసినట్లు నిర్మాణ సంస్థ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు. ఈ చిత్రాన్ని నేచురల్ స్టార్ నాని సమర్పిస్తుండగా, యునానిమస్ ప్రొడక్షన్స్ పతాకంపై దీప్తి ఘంటా నిర్మిస్తున్నారు. “అలియాస్ రుక్మిణి షూటింగ్ పూర్తయింది. మరో 25 రోజుల్లో ఎన్నో చెప్పలేని అందమైన భావోద్వేగాలతో కూడిన ఈ చిత్రాన్ని థియేటర్లలో వేడుకగా జరుపుకుందాం” అని నిర్మాణ సంస్థ పేర్కొంది. దీపావళి పండుగకు ముందు ఈ చిత్రం నుంచి నితిన్ పాత్రకు సంబంధించిన ప్రత్యేక వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో ఆయన ‘యంగ్ కృష్ణ’ అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ వీడియోను పంచుకుంటూ, “ప్రతి ప్రేమకథకు ఒక ‘ముందు’ కథ ఉంటుంది. యంగ్ కృష్ణ.. ఓ కలలు కనే యువకుడు. ఇందులో నన్ను సరికొత్తగా చూస్తారు” అని నితిన్ పేర్కొన్నారు. రుక్మిణి ఆయన జీవితంలోకి రాకముందు కృష్ణ జీవితం ఎలా ఉండేదో ఈ వీడియో ద్వారా పరిచయం చేశారు. ఇందులో రుక్మిణి పాత్రలో ఆఫియా సయ్యద్ కనిపించనున్నారు.

బెల్లంకొండ ‘హైందవ’పై భారీ హైప్



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటిస్తున్న తాజా చిత్రం ‘హైందవ’ విడుదలకు ముందే బిజినెస్ పరంగా వార్తల్లో నిలుస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన నాన్ థియేట్రికల్ హక్కులను ప్రముఖ సంస్థ జీ సొంతం చేసుకున్నట్లు సమాచారం. ఓటీటీ, శాటిలైట్ హక్కుల కోసం కలిపి దాదాపు రూ.30 కోట్లకు డీల్ కుదిరినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇక ఈ సినిమా ఆడియో హక్కులు సైతం మంచి ధరకు అమ్ముడైనట్లు తెలుస్తోంది. సుమారు రూ.2 కోట్లకు ఆడియో రైట్స్ విక్రయించినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో సినిమా విడుదలకు ముందే బిజినెస్ పరంగా మంచి క్రేజ్ సంపాదించుకుంది. దర్శకుడు లుధీర్ బైరెడ్డి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ మూవీలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. భారీ నిర్మాణ విలువలు, ఆసక్తికరమైన కథనం, ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలతో రూపొందుతోన్న ఈ మూవీ ఈ నెల 27న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.

అనిరుధ్-కావ్య పెళ్లి సందడి

గ్రీస్‌కు తలైవా, మాజీ సీఎం స్టాలిన్




ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవో కావ్య మారన్ వివాహ బంధంతో ఒకటవ్వబోతున్నారు. వీరి వివాహ వేడుక గ్రీస్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్‌గా నవంబర్ 10, 11 తేదీల్లో అత్యంత సన్నిహితుల మధ్య జరగనుంది. ఈ వేడుకకు హాజరయ్యేందుకు సూపర్ స్టార్ రజనీకాంత్, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ రోజు ఉదయం విమానాశ్రయం నుంచి గ్రీస్‌కు బయల్దేరి వెళ్లారు. దీంతో ఈ హై-ప్రొఫైల్ వివాహంపై అందరి దృష్టి నెలకొంది. కావ్య మారన్, ప్రఖ్యాత సన్ గ్రూప్ చైర్మన్ కళానిధి మారన్ కుమార్తె. ఆమె ప్రస్తుతం ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవోగా, సన్ టీవీ నెట్‌వర్క్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మరోవైపు అనిరుధ్ రవిచందర్ ప్రస్తుతం దక్షిణాది సినిమా పరిశ్రమలో అగ్ర సంగీత దర్శకుడిగా కొనసాగుతున్నారు. ఎంతోకాలంగా వీరిద్దరి వివాహంపై చర్చలు జరుగుతుండగా, ఇప్పుడు అధికారికంగా పెళ్లి వేడుకలు మొదలయ్యాయి. గ్రీస్‌లో జరిగే ఈ వివాహ వేడుకకు కేవలం ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరు కానున్నారు. ఇది పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమంగా జరగనుంది. అనంతరం నవంబర్ 21న చెన్నైలో సినీ, రాజకీయ, క్రీడా, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖుల కోసం భారీ ఎత్తున రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ రిసెప్షన్‌కు సంబంధించిన ఆహ్వాన పత్రికను కావ్య తల్లిదండ్రులు ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేయడంతో వేడుక తేదీ ఖరారైంది.

మమితకు చాన్సుల వెల్లువ

మలయాళ యంగ్ బ్యూటీ మమిత బైజు ‘ప్రేమలు’ సినిమాతో టాలీవుడ్‌తో పాటు సౌత్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి ఓవర్‌నైట్ స్టార్‌గా మారిపోయింది. తన తొలి ప్రయత్నంలోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఈ భామ, చేసింది తక్కువ సినిమాలే అయినప్పటికీ యూత్‌లో ఊహించని క్రేజ్ తెచ్చుకుంది. అంతేకాకుండా భారతీయ చిత్రసీమలో సరికొత్త రికార్డు సృష్టించి అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆమె ఇటీవల నటించిన విశ్వనాథ్ అండ్ సన్స్, జన నాయగన్, బెత్లెం కుటుంబం యూనిట్ చిత్రాలు ఏకంగా 200 కోట్ల వసూళ్లు రాబట్టి, వరుసగా హ్యాట్రిక్ కొట్టిన తొలి భారతీయ నటిగా చరిత్ర సృష్టించారు. ప్రస్తుతం ‘హలో డియర్’ మూవీతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్న ఈ భామకు తాజాగా మరో బంపర్ ఆఫర్ వచ్చినట్లు సమాచారం. మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ సరసన హీరోయిన్‌గా నటించే క్రేజీ ఛాన్స్ దక్కించుకున్నట్లు నెట్టింట వార్తలు తెగ హల్‌చల్ చేస్తున్నాయి. ‘ఆవేశం’ ఫేమ్ జీతు మాధవన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు టాక్. దుల్కర్ సల్మాన్, మమిత బైజు కాంబినేషన్ వార్తలతో అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జీతు మాధవన్ మేకింగ్, దుల్కర్ స్టార్‌డమ్, మమిత క్రేజ్ తోడైతే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం సృష్టించడం ఖాయమని సినీ ప్రియులు భావిస్తున్నారు.



దర్శకుడిని చాలా నమ్మాను



మ్యారేజ్ తర్వాత సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన కీర్తి సురేష్.. వరుస ప్రాజెక్టులు చేస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఈ అమ్మడు.. ‘డోరతి చిత్రంలో మిమ్మల్ని ఎవరు చంపారు? ఆ పాత్ర ఎలా మరణించింది.. ఆ సస్పెన్స్ ఏంటీ?’ అనే ప్రశ్నపై స్పందిస్తూ.. ‘నా మనసులో కూడా ఇదే ప్రశ్న మెదిలింది. ఆ పాత్రకు ఏమైందో మనం ఎందుకు చూపించలేదు? అని దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్‌ని అడిగాను. ఆయన దీన్ని ఒక ‘ఓపెన్ ఎండెడ్’ (ముగింపును ప్రేక్షకుల ఊహకే వదిలేసేలా) ఉంచాలనుకున్నారు. సాధారణంగా చాలా సినిమాల్లో ఒక పాత్ర ఎలా మరణించింది, దానికి గల కారణం ఏమిటి అనేది చూపిస్తుంటాం. కాబట్టి సహజంగానే మనకు ఇలాంటి ప్రశ్నలు కలుగుతాయి, కానీ ‘డోరతి’ చిత్రంలో దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ ఆ పద్ధతిని మార్చాలనుకున్నారు. ఆ పాత్ర ఎలా మరణించిందో చూపించాల్సిన అవసరం ఏముంది? ఆమె ఎలా మరణించి ఉండవచ్చో మీరే ఊహించుకోవచ్చు కదా!’ అంటూ చెప్పుకొచ్చింది. అలాగే.. ‘నేను ఎప్పుడు నా దర్శకుడిని నమ్ముతాను. ఎందుకంటే కథ పూర్తిగా దర్శకుడి చేతుల్లోనే ఉంటుంది. నటీనటుల కంటే కూడా, ఆ పాత్ర ఎలా ఉండాలి, ఎలా ప్రవర్తించాలి అనే విషయాలు దర్శకుడికి బాగా తెలుసు. అందుకే, ప్రతి విషయాన్ని నేను దర్శకుడినే అడిగి తెలుసుకుంటాను. దర్శకుడు చెప్పిన విషయాలను బట్టి, ఆ పాత్ర ఎలా ఉంటుందో నా మనసులో ఒక రూపురేఖలను సిద్ధం చేసుకుంటాను. అందుకే డోరతిలో కూడా నా పాత్ర దర్శకుడిని నమ్మి చేశాను’ అని చెప్పుకొచ్చింది కీర్తి సురేష్.

సమంత లేటెస్ట్ బేబీ బంప్ ఫొటో



ప్రముఖ నటి సమంత త్వరలోనే మాతృత్వపు మధురిమలను ఆస్వాదించబోతున్నారు. భర్త, ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి తమ మొదటి సంతానాన్ని ఆహ్వానించేందుకు సిద్ధమవుతున్న ఆమె, తన ప్రెగ్నెన్సీ ప్రయాణానికి సంబంధించిన విశేషాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంటున్నారు. తాజాగా సమంత తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో బేబీ బంప్‌తో ఉన్న ఒక సరికొత్త ఫొటోను పోస్ట్ చేశారు. సాధారణంగా సెలబ్రిటీలు మెటర్నిటీ సమయంలో భారీ సెట్టింగులు, డిజైనర్ డ్రెస్సులతో గ్రాండ్‌గా ఫొటోషూట్‌లు చేస్తుంటారు. అయితే సమంత మాత్రం ఎంతో భిన్నంగా, సాధారణ వాతావరణంలో కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు. ఇంట్లోని సోఫాపై ప్రశాంతంగా కూర్చుని సేదతీరుతున్న ఒక క్యాజువల్ ఫొటోను ఆమె పంచుకున్నారు. రెడ్ కలర్ టాప్, వైట్ ట్రౌజర్ ధరించి, బ్లాక్ సన్‌గ్లాసెస్‌తో చాలా కూల్‌గా ఉన్న లుక్‌లో బేబీ బంప్‌ను సున్నితంగా పట్టుకుని ఆమె కనిపించారు. ఈ ఫొటోకు “దీనినే నా మెటర్నిటీ షూట్‌గా భావించండి” అంటూ ఒక సరదా క్యాప్షన్ జోడించారు.





మూడో వన్డేకు వాన ముప్పు

భారత్ – న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న వన్డే సిరీస్‌కు వరుణుడు పదేపదే అడ్డంకిగా మారుతున్నాడు. ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌లకు వర్షం అంతరాయం కలిగించగా.. మంగళవారం హామిల్టన్‌లో జరగనున్న మూడో వన్డేకూ వర్షం ముప్పు పొంచి ఉంది. ఇవాళ జట్టు సాధన సమయంలో వర్షం రావడంతో అవుట్ డోర్ ప్రాక్టీస్‌ను ఇండోర్ స్టేడియానికి మార్చారు. మంగళవారం హామిల్టన్‌లో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ సంస్థ తెలిపింది. తొలి రెండు వన్డేల్లోనూ విజయం సాధించిన భారత్ 2-0తో ఆధిక్యంలో ఉంది. ఆక్లాండ్‌లో జరిగిన తొలి వన్డేలో డక్‌వర్త్ లూయిస్ (డీఎల్ఎస్) పద్ధతిలో ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. వెల్లింగ్టన్‌లో నాలుగు పరుగుల తేడాతో విజయం సాధించింది. మూడో వన్డేలోనూ గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని టీమ్‌ఇండియా పట్టుదలగా ఉంది. అయితే, అందుకు వరుణుడు సహకరిస్తాడో, లేదో చూడాలి.



డిసెంబర్ 9న దక్షిణాఫ్రికా
పర్యటనకు భారత మహిళలు

భారత మహిళల క్రికెట్ జట్టు దక్షిణాఫ్రికా పర్యటనకు సిద్ధమైంది. పర్యటనలో భాగంగా ఆతిథ్య జట్టుతో భారత్ ఒక టెస్టు, మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడనుంది. ఈ మ్యాచ్‌ల కోసం బీసీసీఐ జట్లను ప్రకటించింది. మూడు ఫార్మాట్లలోనూ స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించనుంది. డిసెంబర్ 9న గెబెర్హాలో ప్రారంభంకానున్న ఏకైక టెస్టు మ్యాచ్‌తో టూర్ మొదలవుతుంది.

టెస్టు జట్టు: స్మృతి మంధాన (కెప్టెన్), షెఫాలి వర్మ, ప్రతికా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యస్తికా భాటియా (వికెట్ కీపర్), దీప్తి శర్మ (వైస్ కెప్టెన్), శ్రీ చరణి, వైష్ణవి శర్మ, క్రాంతి గౌడ్, నందిని శర్మ, జింతిమణి కలిత, సయాలీ.

టీ20 జట్టు: స్మృతి మంధాన (కెప్టెన్), షెఫాలివర్మ (వైస్ కెప్టెన్), జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్, నికీ ప్రసాద్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి కమలిని (వికెట్ కీపర్), అనుష్క శర్మ, దీప్తి శర్మ, శ్రీ చరణి, ప్రేమ రావత్, అమన్‌జోత్ కౌర్, క్రాంతి గౌడ్, నందిని శర్మ, రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతి రెడ్డి, సయాలీ.

వన్డే జట్టు: స్మృతి మంధాన (కెప్టెన్), షెఫాలి వర్మ, ప్రతికా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యస్తికా భాటియా (వికెట్ కీపర్), దీప్తి శర్మ (వైస్ కెప్టెన్), శ్రీ చరణి, స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్, నందిని శర్మ, జింతిమణి కలిత, సయాలీ సత్ఘరే.



కెప్టెన్‌గా సూర్య రీఎంట్రీ

టీమిండియా స్టార్ ఆటగాడు సూర్యకుమార్ యాదవ్‌కు ప్రమోషన్ లభించింది. 2026 సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో ముంబై జట్టుకు సూర్యకుమార్ యాదవ్ సారథ్యం వహించనున్నాడు. రెండు రోజుల కిందటే సూర్యకు కెప్టెన్సీ బాధ్యతలు తిరిగి అప్పగించనున్నట్లు ఊహాగానాలు వ్యక్తమయిన వేళ ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) సోమవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇక సూర్యకుమార్ ఐపీఎల్ 2026 సీజన్‌లో చివరిసారిగా ఆడాడు. అంతకముందు అతడి కెప్టెన్సీలో టీమిండియా 2026 టీ20 ప్రపంచకప్ గెలిచిన సంగతి తెలిసిందే. కెప్టెన్‌గా సక్సెస్ అయినప్పటికీ, బ్యాటర్‌గా విఫలం కావడంతో జట్టులో చోటు కోల్పోయాడు. అప్పటినుంచి భారత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చేందుకు సూర్యకుమార్ కష్టపడుతూనే ఉన్నాడు. తాజాగా ముంబైకి కెప్టెన్‌గా ఎంపికవ్వడంపై సూర్యకుమార్ స్పందించాడు. "ముంబైకి ప్రాతినిధ్యం వహించడం ఎల్లప్పుడూ గౌరవంగానే భావిస్తాను. కెప్టెన్సీ బాధ్యతలు అప్పజెప్పి దానికి మరింత బాధ్యత తీసుకొచ్చారు. అనుభవజ్ఞులైన ఆటగాళ్లు, యువ ప్రతిభావంతులతో జట్టు సమతుల్యంగా కనిపిస్తోంది. ప్రతీ మ్యాచ్‌లోనూ జట్టుగా అత్యుత్తమ ప్రదర్శన ఇస్తామన్న నమ్మకంతో ఉన్నాం. అంతిమంగా ట్రోఫీని ఇంటికి తీసుకురావడమే మా లక్ష్యం" అని చెప్పుకొచ్చాడు.

ఐపీఎల్ 2026 సూపర్ స్ట్రయికర్‌గా వైభవ్ సూర్యవంశీ



బ్యాటింగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ.. తన ఆటశైలితో అందర్నీ ఆకట్టుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఐపీఎల్ 2026 సీజన్‌లో వైభవ్.. సూపర్ స్ట్రయికర్ అవార్డును గెలుచుకున్నాడు. దానిలో భాగంగా అతనికి ఓ కారును గిఫ్ట్‌గా ఇచ్చారు. 15 ఏళ్ల బీహారీ బ్యాటర్.. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇండియా జట్టుతోనూ బీజీగా ఉన్న వైభవ్.. దీపావేళి వేళ కొత్త కారును అందుకున్నారు. సూపర్ స్ట్రయికర్ అవార్డు కింద అతనికి టాటా సియార్రా ఎస్‌యూవీ అందజేశారు. ఫ్యామిలీతో కలిసి టాటా షోరూమ్ వెళ్లిన అతను ఆ కారును స్వీకరించాడు. పసుపు రంగు టాటా కారును వైభవ్ తీసుకున్నాడు. పేరెంట్స్, సోదరులతో కలిసి అతను ఆ కారను అందుకున్నాడు. వాస్తవానికి వైభవ్ గ్యారేజీలో గిఫ్ట్‌గా వచ్చిన చాలా కార్లు ఉన్నాయి. ఐపీఎల్ 2025 సీజన్‌లో కూడా సూపర్ స్ట్రయికర్ అవార్డు కింద వైభవ్ కు టాటా కర్వ్ ఈవీ కారును గిఫ్ట్‌గా ఇచ్చారు. 2026 ఐపీఎల్ సీజన్‌లో వైభవ్ 16 మ్యాచుల్లో 776 రన్స్ చేశాడు. ఆ టోర్నీ లో అతను 63 ఫోర్లు, 72 సిక్సర్లు బాదాడు. ఆరెంజ్ క్యాప్ గెలిచాడ్డు.



ముష్ఫికర్ రికార్డు

బంగ్లాదేశ్ సీనియర్ వికెట్ కీపర్ బ్యాటర్ ముష్ఫికర్ రహీమ్ టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ ఫార్మాట్‌లో 7000 పరుగులు పూర్తిచేసిన తొలి బంగ్లాదేశ్ క్రికెటర్‌గా అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. వెస్టిండీస్‌తో సిల్హెట్ వేదికగా ఈరోజు ముగిసిన రెండో టెస్టు మ్యాచ్‌లో ముష్ఫికర్ ఈ మైలురాయిని చేరుకున్నాడు. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టెస్టుకు దూరంగా ఉన్న 39 ఏళ్ల ముష్ఫికర్.. రెండో టెస్టులో బరిలోకి దిగాడు. మ్యాచ్ ప్రారంభానికి ముందు అతను 7000 పరుగుల మార్క్‌కు 43 పరుగుల దూరంలో ఉన్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 34 పరుగులు చేసి అవుటయ్యాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో మ్యాచ్ ఐదోరోజు ఆటలో భాగంగా రోస్టన్ చేజ్ బౌలింగ్‌లో ఒక సింగిల్ తీసి 9 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఈ చారిత్రక మైలురాయిని అందుకున్నాడు. ఈ ఇన్నింగ్స్‌లో 49 పరుగులు చేసి అతను నాటౌట్‌గా నిలిచాడు. బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 369 పరుగుల లక్ష్యఛేదనలో 184/4 స్కోరు వద్ద ఉండగా వెలుతురు మందగించడంతో అంపైర్లు మ్యాచ్‌ను నిలిపివేశారు. దాంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. బంగ్లాదేశ్ తరఫున టెస్టుల్లో 5000, 6000 పరుగుల మైలురాళ్లను కూడా తొలుత అందుకున్నది ముష్ఫికర్ రహీమే కావడం గమనార్హం. ప్రస్తుతం రహీమ్ 7000 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. రెండో స్థానంలో ఉన్న మోమినుల్ హక్ (5293) కంటే 1747 పరుగులు, ఇప్పటికే రిటైరైన తమీమ్ ఇక్బాల్ (5134) కంటే 1906 పరుగులు ఆధిక్యంలో రహీమ్ కొనసాగుతున్నాడు. 2005లో లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్‌పై టెస్టు అరంగేట్రం చేసిన ముష్ఫికర్ రహీమ్, బంగ్లాదేశ్ తరఫున అత్యధిక టెస్టులు ఆడిన ఆటగాడిగానూ రికార్డు సృష్టించాడు. ఇప్పటివరకు 107 టెస్టులు ఆడిన అతను, దేశం తరఫున 100 టెస్టులు పూర్తి చేసిన ఏకైక ఆటగాడు. ఇప్పటికే వన్డే, టీ20 ఫార్మాట్‌లకు వీడ్కోలు పలికిన ముష్ఫికర్ కేవలం టెస్టు క్రికెట్‌లో మాత్రమే బంగ్లాదేశ్‌కు తన సేవలు అందిస్తున్నాడు.

హైదరాబాదీ బాడీబిల్డర్ వెంకటేశన్‌కు మిస్టర్ నేచురల్ వరల్డ్ టైటిల్

హైదరాబాదీ బాడీబిల్డర్ కే వెంకటేశన్.. ఆదివారం లాస్ ఏంజిల్స్‌లో జరిగిన మిస్టర్ నేచురల్ వరల్డ్ బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ గెలిచాడు. శాఖాహారి అయిన వెంకటేశన్.. స్వర్ణ పతకం గెలవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ టుడేతో ఆయన మాట్లాడారు. గత ఏడాది కూడా స్వర్ణ పతకాన్ని గెలిచినట్లు ఈ సందర్భంగా 49 ఏళ్ల బాడీబిల్డర్ వెంకటేశన్ గుర్తు చేశారు. ప్రతి బాడీ బిల్డింగ్ పోటీ ఓ సవాల్ అని, ఇది కూడా అలాంటిదే అని, తాజా ఈవెంట్ చాలా ఎనర్జిటిక్‌గా జరిగిందని, కాంపిటీషన్‌లో ప్రతి ఒక్కరూ తీవ్ర పోటీ ఇచ్చారని వెంకటేశన్ తెలిపారు. జూబ్లీ హిల్స్‌లో ఉన్న వన్ ఫిట్‌నెస్ స్టూడియో కో-ఓనర్ మిస్టర్ కుమార్ మన్నావాకు వెంకటేశన్ కృతజ్ఞతలు తెలిపారు. నూరు శాతం శాఖాహార బాడీబిల్డర్ అని, ఆ దీక్ష, క్రమశిక్షణ, నిరంతర శ్రమను ప్రదర్శించడం వల్ల తన ఫిట్‌నెస్ సాధించినట్లు చెప్పారు. వృక్ష ఆధారిత జీవనశైలితోనూ మన ఫిట్‌నెస్ లక్ష్యాలను సాధించవచ్చు అని వెంకటేశన్ తెలిపారు. శాఖాహారిగా బాడీ బిల్డింగ్‌ను కొనసాగించడం చాలా కష్టమైన అంశమని, కానీ బాడీ బిల్డింగ్ కేవలం తన హాబీ మాత్రమే కాదు అని, అది నా ప్యాషన్, లైఫ్ స్టయిల్ అని వెంకటేశన్ తెలిపారు. డబ్బు కోసమో, పేరు కోసం ఈ పోటీల్లో పాల్గొనలేదని, బాడీ బిల్డింగ్‌ను ఇష్టపడుతానని, ఆ అనుభవం అమోఘమైందని, ప్రతి ఏడాది తనకు తానే ఛాలెంజ్ విసురుకుంటానన్నారు. కఠిన శ్రమ, సహనం, క్రమశిక్షణ, నమ్మకం వల్లే తాను పతకాన్ని గెలుచుకోగలిగినట్లు చెప్పారు.

భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్‌పై సస్పెన్షన్

భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్, ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత షబ్బీర్ అలీపై తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ సస్పెన్షన్ విధించింది. అబ్బాస్ యూనియన్ ఫుట్‌బాల్ క్లబ్ ప్రెసిడెంట్ హోదాలో షబ్బీర్ అలీ అనైతిక చర్యలకు పాల్పడినట్లు తేలింది. ఏడాది పాటు అతనిపై వేటు వేశారు. అబ్బాస్ ఫుట్‌బాల్ క్లబ్ ప్రెసిడెంట్ హోదాలో షబ్బీర్ క్రమశిక్షణ ఉల్లంఘనలకు పాల్పడ్డారు. టీఎఫ్ఏ ఎగ్జిక్యూటివ్ కమిటీ మీటింగ్, టెక్నికల్ కమిటీ మీటింగ్, జనరల్ బాడీ మీటింగ్‌లో షబ్బీర్‌పై చర్యలు తీసుకున్నట్లు తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ జీ ఫాల్గుణ తెలిపారు. సంతోష్ ట్రోఫ్ కోసం తెలంగాణ జట్టుకు కోచ్‌గా షబ్బీర్‌ను నియమించారు. అయితే ఆ నియామక సమయంలో ఏఐఎఫ్ఎఫ్ మార్గదర్శకాల ప్రకారం తన వద్ద ఏఎఫ్‌సీ బీ లైసెన్స్ సర్టిఫికేట్ ఉన్నట్లు ఆయన చెప్పారు. ఆ సమాచారం ఆధారంగానే షబ్బీర్‌ను కోచ్‌గా నియమించినట్లు టీఎఫ్ఏ పేర్కొన్నది. కానీ బెంగుళూరులో సంతోష్ ట్రోఫీ జరుగుతున్న సమయంలో షబ్బీర్‌ను కోచ్‌గా ఏఐఎఫ్ఎఫ్ అంగీకరించలేదు. ఏఎఫ్‌సీ బీ లైసెన్సు సర్టిఫికేట్ అతని వద్ద లేదని గ్రహించామని ఫాల్గుణ తెలిపారు. షబ్బీర్ క్రమశిక్షణా ఉల్లంఘనకు పాల్పడినట్లు తేలింది. షబ్బీర్‌కు కోచింగ్ సామర్థ్యం లేదని ఆరోపణలు రావడంతో తెలంగాణ ఫుట్‌బాల్ సంఘం ఆయన్ను సస్పెండ్ చేసింది. రూల్స్‌కు వ్యతిరేకంగా పలు క్రీడా సమావేశాలకు కూడా షబ్బీర్ హాజరైనట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి.



ఈవార్తలు
ప్రజావాణి
మంగళవారం 10-11-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు

సంపాదకీయం

Editorial

ఐదు రాష్ట్రాల ఎన్నికలు.. బీజేపీకి శీలపరీక్ష!

దేశ రాజకీయాల్లో ఎన్నికలు సహజం. గెలుపోటములు రాజకీయ పార్టీలకు కొత్తేమీ కాదు. కానీ కొన్ని ఎన్నికలు మాత్రం పార్టీల భవిష్యత్తు రాజకీయ దిశను, ప్రజల్లో వాటికి ఉన్న ఆదరణను, నాయకత్వంపై విశ్వాసాన్ని పరీక్షిస్తాయి. రాబోయే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు బీజేపీకి అలాంటి పరీక్షనే ఎదురుచూపిస్తున్నాయి. అధికారమే లక్ష్యంగా సాగుతున్న రాజకీయాలకు, ప్రజల విశ్వాసమే పునాదిగా నిలవాలనే విషయాన్ని ఈ ఎన్నికలు మరోసారి గుర్తుచేయనున్నాయి. ఒక పార్టీకి జాతీయ స్థాయిలో ఎంతటి బలం ఉన్నా రాష్ట్రాల ప్రజల ఆకాంక్షలను విస్మరిస్తే ఆదరణ తగ్గే ప్రమాదం ఉంటుంది. కేంద్రంలో అధికారంలో ఉండటం, ఎన్నికల ప్రచారంలో అగ్రనేతలు పాల్గొనడం మాత్రమే విజయానికి హామీ ఇవ్వవు. స్థానిక సమస్యలపై అవగాహన, రాష్ట్ర నాయకత్వం, ప్రజలకు అందిన పాలనాఫలాలు, ఇచ్చిన హామీల అమలు.. ఇవే ఎన్నికల్లో కీలకంగా మారతాయి. ఇప్పుడు బీజేపీ పాలనలో ఉన్న ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్ రాష్ట్రాల్లో ప్రభుత్వాల పనితీరుపై ప్రజల తీర్పు కీలకం కానుంది. మరోవైపు పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీకి కూడా ప్రజల ముందుకు వెళ్లాల్సిన సమయం ఆసన్నమవుతోంది. ఐదు రాష్ట్రాల ఎన్నికలు 2027 ఫిబ్రవరి-మార్చిలో జరిగే అవకాశాలున్నాయి. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ ఎన్నికలు జాతీయ రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యత కలిగి ఉన్నాయి. దేశంలోనే అత్యధిక శాసనసభ స్థానాలున్న ఈ రాష్ట్రంలో వచ్చే ఫలితాలు జాతీయ రాజకీయాలపై ప్రభావం చూపుతాయి. యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలోని ప్రభుత్వానికి అభివృద్ధి, శాంతిభద్రతలు, ఉపాధి, రైతుల సమస్యలు, సామాజిక సమీకరణలు ప్రధాన సవాళ్లుగా నిలవనున్నాయి. ఉత్తరాఖండ్‌లో ప్రభుత్వ పనితీరు, స్థానిక సమస్యలు, గోవాలో రాజకీయ స్థిరత్వం, మణిపూర్‌లో శాంతి పునరుద్ధరణ వంటి అంశాలు బీజేపీకి కీలకంగా మారనున్నాయి. మణిపూర్ విషయంలో ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అక్కడి సామాజిక ఉద్రిక్తతలు, నిరాశ్రయుల సమస్య, సాధారణ పరిస్థితుల పునరుద్ధరణపై ప్రజలకు స్పష్టమైన సమాధానాలు అవసరం. కేవలం రాజకీయ హామీలతో ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందడం సాధ్యం కాదు. బాధితులకు న్యాయం, పునరావాసం, శాశ్వత శాంతి దిశగా జరిగిన ప్రయత్నాలే అక్కడి రాజకీయ చర్చలో కీలకం కావాలి. ఇక బీజేపీకి మరో ముఖ్యమైన సవాలు రాష్ట్ర నాయకత్వం. జాతీయ నాయకత్వం ప్రభావం ఉన్నప్పటికీ స్థానిక నాయకుల పనితీరు, ప్రజలతో సంబంధాలు, పార్టీ అంతర్గత సమన్వయం కూడా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తాయి. కేంద్ర నాయకుల సభలు, ప్రచార ఆర్భాటం కంటే స్థానిక సమస్యలకు పరిష్కారాలు చూపడం ముఖ్యం. అధికారంలో ఉన్న చోట ప్రభుత్వ వ్యతిరేకతను ఎలా ఎదుర్కొంటుంది? ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు చేసింది? సామాన్యుడి జీవితంలో ఎలాంటి మార్పు తీసుకొచ్చింది? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది.



ప్రజాస్వామ్యమా? నాయక స్వామ్యమా?

డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి,
కాకతీయ యూనివర్సిటీ

భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ప్రజలే పాలకులు, ప్రజలే నిర్ణేతలు, ప్రజల సంక్షేమమే ప్రభుత్వాల పరమావధి అనే ఆశయాలతో మన రాజ్యాంగం రూపుదిద్దుకుంది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం ప్రజాస్వామ్యానికి పునాదులు. కానీ నేటి రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే ఒక ప్రశ్న ఉత్పన్నమవుతోంది. మనం నిజంగా ప్రజాస్వామ్యంలో జీవిస్తున్నామా? లేక ప్రజాస్వామ్యం ముసుగులో నాయకస్వామ్యాన్ని అనుభవిస్తున్నామా? భారతీయ సమాజంలో కులం, మతం అనేవి చారిత్రక, సామాజిక, సాంస్కృతిక గుర్తింపులు. కానీ రాజకీయ ప్రయోజనాల కోసం వీటిని విభజన అస్త్రాలుగా ఉపయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించాల్సిన నాయకత్వం, కులాల మధ్య గోడలు నిర్మించి, మతాల మధ్య అనుమానాలను పెంచితే సమాజం ప్రగతిపథంలో ఎలా పయనిస్తుంది? ఓటు అనేది కులానికి వేసే ముద్ర కాదు, మతానికి సమర్పించే కానుక కాదు. అది ప్రజల భవిష్యత్తును నిర్ణయించే రాజ్యాంగబద్ధమైన హక్కు. కులాభిమానాన్ని ఓటు బ్యాంకుగా, మత విశ్వాసాన్ని రాజకీయ పెట్టుబడిగా మార్చే ధోరణి ప్రజల ఆలోచనా స్వేచ్ఛను క్రమంగా బలహీనపరుస్తుంది. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం. ప్రజాప్రతినిధులు ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపాలుగా నిలవాలి. కానీ ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు, ఆకర్షణీయమైన ప్రకటనలు, భావోద్వేగపూరిత ప్రసంగాలు, కులమత సమీకరణాలు ఓటరు ఆలోచనను ప్రభావితం చేసే సాధనాలుగా మారుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఎన్నికల ముందు ప్రజల చుట్టూ తిరిగే నాయకులు, ఎన్నికల అనంతరం ప్రజలకు అందుబాటులో లేకపోవడం ప్రజాప్రతినిధిత్వ వ్యవస్థలోని బాధాకరమైన వైరుధ్యం. ప్రజల ఓటుతో అధికారంలోకి వచ్చి, ప్రజలకే జవాబుదారీగా ఉండకపోవడం ప్రజాస్వామ్య విలువలకు విఘాతం.

అభివృద్ధి అంటే ఆకాశహర్మ్యాలు, భారీ ప్రకటనలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు మాత్రమే కాదు. ప్రతి పేదవాడికి విద్య, ప్రతి కుటుంబానికి వైద్యం, ప్రతి యువకుడికి ఉపాధి, ప్రతి రైతుకు గిట్టుబాటు ధర, ప్రతి పౌరుడికి గౌరవప్రదమైన జీవనం అందినప్పుడే నిజమైన అభివృద్ధి సాకారమవుతుంది. ప్రభుత్వాలు సాధించిన విజయాలను ప్రచారం చేసుకోవడంలో తప్పులేదు. కానీ ప్రచారమే ప్రగతిగా, ప్రకటనలే పాలనగా, గణాంకాలే ప్రజాసంక్షేమంగా చిత్రీకరించబడితే అభివృద్ధి అసలు లక్ష్యం మరుగునపడుతుంది. ప్రభుత్వ ఖజానాలోని ప్రతి రూపాయి ప్రజల కష్టార్జితం. పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన ధనం ప్రజల సంక్షేమానికే వినియోగించబడాలి. అధికార దుర్వినియోగం, అవినీతి, కాంట్రాక్టుల్లో అక్రమాలు, అనవసర వ్యయాలు చోటుచేసుకుంటే నష్టపోయేది ప్రజలే. అవినీతి అనేది కేవలం ఆర్థిక నేరం కాదు; అది పేదవాడి విద్యను, రోగి వైద్యాన్ని, నిరుద్యోగి ఉపాధి అవకాశాన్ని, రైతు ఆశను దోచుకునే సామాజిక అన్యాయం. ప్రజాధనానికి కాపలాదారులుగా ఉండాల్సిన పాలకులు దాని వినియోగానికి ప్రజల ముందు జవాబుదారీగా ఉండాలి.

ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఓటు వేయడం మాత్రమే కాదు. ప్రశ్నించడం, ప్రశ్నలకు సమాధానాలు కోరడం, ప్రభుత్వ విధానాలను పరిశీలించడం, ప్రజాధన వినియోగాన్ని పర్యవేక్షించడం కూడా ప్రజాస్వామ్య బాధ్యతలే. రాజకీయ నాయకులను వారి కులం, మతం, పార్టీ గుర్తులతో కాకుండా వారి ప్రజాసేవ, పాలనా పారదర్శకత, నిబద్ధత, జవాబుదారీతనం ఆధారంగా అంచనా వేయాలి. ప్రజాస్వామ్యం అనేది నాయకుల అధికారానికి రాజమార్గం కాదు; ప్రజల హక్కులకు రక్షణ కవచం. కులం పేరుతో విడిపోకుండా, మతం పేరుతో కలహించకుండా, ఎన్నికల ప్రలోభాలకు లొంగకుండా, అభివృద్ధి పేరుతో జరిగే ప్రచారాన్ని వాస్తవాలతో బేరీజు వేసుకుంటూ ప్రజలు చైతన్యవంతులు కావాలి. దేశాన్ని పాలించేవారు ప్రజలకు యజమానులు కాదు, ప్రజల తరఫున బాధ్యతలు నిర్వహించే ప్రతినిధులు మాత్రమే. ప్రజలు నాయకుల కోసం కాదు, నాయకులు ప్రజల కోసం ఉన్నారనే స్పృహ పాలనలో ప్రతిబింబించినప్పుడే ప్రజాస్వామ్యానికి అసలైన అర్థం చేకూరుతుంది. లేకపోతే ప్రజాస్వామ్యం పేరుతో ఎన్నికలు జరుగుతాయి, నాయకులు మారుతారు, అధికారాలు చేతులు మారుతాయి. కానీ సామాన్యుడి బతుకు మాత్రం మారదు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేది నాయకుల ప్రసంగాలు కాదు, ప్రజల ప్రశ్నించే తత్వం. ప్రజల చైతన్యమే ప్రజాస్వామ్యానికి నిజమైన ప్రాణవాయువు.



శ్రీనివాస్ జీడిపల్లి, తూప్రాన్

ముందు ప్రజలు మారాలి!

భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు నిర్వహించడం, పార్టీలు అధికారంలోకి రావడం కాదు. ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కులు కల్పించడంతోపాటు పాలకులు ప్రజలకు జవాబుదారీగా ఉండటమే నిజమైన ప్రజాస్వామ్యం. కానీ నేడు ప్రజల కోసం రాజకీయాలు కొనసాగుతున్నాయా? లేక రాజకీయ నాయకుల స్వప్రయోజనాల కోసం ప్రజలను ఉపయోగించుకుంటున్నారా? అనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. భారత రాజ్యాంగం 1949 నవంబర్ 26న ఆమోదం పొంది, 1950 జనవరి 26న అమల్లోకి వచ్చింది. 1951-52లో తొలి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. కులం, మతం, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా వయోజన పౌరులకు ఓటు హక్కు కల్పించడం భారత ప్రజాస్వామ్య చరిత్రలో గొప్ప ముందడుగు. ప్రారంభంలో 21 ఏళ్లుగా ఉన్న ఓటు హక్కు వయస్సును 61వ రాజ్యాంగ సవరణ ద్వారా 18 ఏళ్లకు తగ్గించారు. 1952-1967 మధ్య రాజకీయాల్లో సిద్ధాంతాలు, దేశ నిర్మాణం, ప్రజాసేవకు ప్రాధాన్యత ఉండేది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి,
కాకతీయ యూనివర్సిటీ



నెహ్రూ నాయకత్వంలో కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగినా కమ్యూనిస్టులు, సోషలిస్టులు, జనసంఘ్ వంటి పార్టీలు తమ సిద్ధాంతాలతో ప్రజల్లోకి వెళ్లాయి. రాజకీయ ప్రత్యర్థుల మధ్య విభేదాలున్నా పరస్పర గౌరవం, ప్రజాస్వామ్య చర్చలకు ప్రాధాన్యత కనిపించేది. అయితే అప్పట్లోనూ కుల వివక్ష, పేదరికం, సామాజిక అసమానతలు ఉండేవి. 1967 ఎన్నికలతో కాంగ్రెస్ ఆధిపత్యానికి సవాలు ఎదురైంది. ప్రాంతీయ పార్టీలు, ప్రతిపక్షాలు బలపడ్డాయి. 1969 తెలంగాణ ఉద్యమం ప్రాంతీయ అసమానతలు, హక్కుల అంశాలను ముందుకు తెచ్చింది. 1975లో అత్యవసర పరిస్థితి విధింపు, పౌర హక్కులపై ఆంక్షలు, పత్రికా సెన్సార్‌షిప్ ప్రజాస్వామ్యానికి తీవ్ర పరీక్షగా నిలిచాయి. 1977లో ప్రజలు కాంగ్రెస్‌ను ఓడించి జనతా పార్టీకి అధికారం అప్పగించడం ఓటరు శక్తిని చాటింది. 1977-1989 మధ్య ప్రత్యామ్నాయ రాజకీయాలు, ప్రాంతీయ నాయకత్వం బలపడ్డాయి. జనతా పార్టీ అంతర్గత విభేదాలతో ప్రభుత్వం కూలిపోగా, 1982లో ఏర్పడిన తెలుగుదేశం పార్టీ 1983లో ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చింది. ప్రాంతీయ ఆత్మగౌరవం జాతీయ రాజకీయాల్లోనూ కీలకమని నిరూపించింది.

1989-2004 మధ్య సంకీర్ణ రాజకీయాలు, కుల సమీకరణాలు, సామాజిక న్యాయం, మతపరమైన రాజకీయాలు ప్రాధాన్యత పొందాయి. 1991 ఆర్థిక సంస్కరణలతో ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ, విదేశీ పెట్టుబడులపై చర్చలు పెరిగాయి. 2004-2014 మధ్య ఉపాధి హామీ, సమాచార హక్కు, విద్యా హక్కు, ఆహార భద్రత వంటి సంక్షేమ అంశాలు ముందుకొచ్చాయి. అదే సమయంలో అవినీతి ఆరోపణలు, ఎన్నికల వ్యయం, కార్పొరేట్ ప్రభావం, మీడియా రాజకీయ ప్రచార సాధనంగా మారడం విమర్శలకు దారితీశాయి. 2014 తర్వాత వ్యక్తికేంద్రిత ప్రచారం, జాతీయవాదం, సామాజిక మాధ్యమాల ప్రభావం పెరిగాయి. ఫేస్‌బుక్, వాట్సాప్, యూట్యూబ్ రాజకీయ ప్రచారానికి ప్రధాన వేదికలయ్యాయి. ప్రజలకు సమాచారం వేగంగా చేరుతున్నప్పటికీ తప్పుడు వార్తలు, వ్యక్తిగత దూషణలు, నిర్ధారణ కాని ఆరోపణలు కూడా విస్తరించాయి. 2019-2024 మధ్య సంక్షేమం, జాతీయ భద్రత, మౌలిక సదుపాయాలు, ఎన్నికల ఆర్థిక వ్యవస్థ ప్రధాన చర్చలయ్యాయి. 2024లో సుప్రీంకోర్టు ఎన్నికల బాండ్ల పథకాన్ని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించడం రాజకీయ నిధుల పారదర్శకత అవసరాన్ని మరోసారి గుర్తుచేసింది. 2024 ఎన్నికల్లో బీజేపీ 240 స్థానాలు, కాంగ్రెస్ 99 స్థానాలు సాధించగా, ఎన్డీఏ 292 స్థానాలతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కూటమి రాజకీయాల ప్రాధాన్యత స్పష్టమైంది. 2026 నాటికి రాజకీయ వ్యవస్థకు కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్ విశ్లేషణ ప్రకారం, 2024లో ఎన్నికైన లోక్‌సభ సభ్యుల్లో 251 మంది తమపై క్రిమినల్ కేసులున్నట్లు అఫిడవిట్లలో ప్రకటించారు. వారిలో 170 మందిపై తీవ్రమైన నేర ఆరోపణలకు సంబంధించిన కేసులున్నాయి. కేసులు నమోదవడం నేరం రుజువైనట్లు కాదన్న న్యాయసూత్రాన్ని గౌరవిస్తూనే అభ్యర్థుల ఎంపికలో పార్టీలు నైతిక ప్రమాణాలు పాటించాల్సిన అవసరం ఉంది.

నాటి రాజకీయాలను పూర్తిగా ఆదర్శంగా, నేటి రాజకీయాలను పూర్తిగా దిగజారినవిగా చూడలేం. అయితే నేడు సిద్ధాంతాల కంటే వ్యక్తుల ప్రాధాన్యత, ప్రజా సమస్యల కంటే భావోద్వేగాలు, అభివృద్ధి కంటే కులమత సమీకరణాలు, విధాన చర్చల కంటే వ్యక్తిగత దూషణలు పెరుగుతున్నాయి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు గురించి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. ప్రత్యర్థులు శత్రువులు కాదు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలకు గౌరవం ఉండాలి. రాజకీయ నాయకుల విభేదాలు వారి అధికార పోరాటంలో భాగం కావచ్చు. కానీ వాటి కారణంగా ప్రజల మధ్య శత్రుత్వం పెరగడం ప్రమాదకరం. ఎన్నికల సమయంలో కార్యకర్తలు ఘర్షణ పడుతుంటే, ఎన్నికల తర్వాత నాయకులు కలుసుకోవడం, అవసరమైతే పొత్తులు పెట్టుకోవడం చూస్తున్నాం. కానీ సామాన్య ప్రజలు మాత్రం ఆ విభేదాలను సంవత్సరాల పాటు కొనసాగిస్తున్నారు. ఒక పార్టీ కోసం స్నేహాన్ని, కుటుంబ అనుబంధాలను, గ్రామ ఐక్యతను కోల్పోవాల్సిన అవసరం ఏముంది? ప్రజలు రాజకీయ పార్టీలకు బానిసలు కాదు. పార్టీలే ప్రజలకు సేవ చేయడానికి ఏర్పడిన వ్యవస్థలు. ఒకసారి ఒక పార్టీకి ఓటు వేసినంత మాత్రాన జీవితాంతం అదే పార్టీకి మద్దతు ఇవ్వాల్సిన అవసరం లేదు. నాయకులను ప్రశ్నించే హక్కు, ప్రభుత్వ విధానాలను విమర్శించే స్వేచ్ఛ ప్రతి పౌరుడికీ ఉంది. ప్రజాస్వామ్యంలో మీడియా కూడా కీలక పాత్ర పోషించాలి. ప్రభుత్వాలను ప్రశ్నించడం, ఎన్నికల హామీల అమలును పరిశీలించడం, ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించడం బాధ్యత. రాజకీయ ప్రచారానికి, ప్రజా సమాచారానికి మధ్య తేడాను గుర్తించాలి. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రతి వార్తను నమ్మకుండా వాస్తవాలను ధృవీకరించాలి.

యువతకు ఆవేశం కంటే ఆలోచన అవసరం. రాజ్యాంగం, ప్రభుత్వ విధానాలు, ప్రజాప్రతినిధుల పనితీరుపై అవగాహన పెంచుకోవాలి. గ్రామాల్లో రహదారులు, పాఠశాలలు, ఆసుపత్రులు, సాగునీరు, ఉద్యోగాలపై ప్రశ్నించాలి. రాజకీయ నాయకుల వెంట నడవడం కంటే ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిలబడాలి. ఓటర్లు కూడా అభ్యర్థుల గత ప్రజాసేవ, విద్యార్హతలు, ఆస్తులు, కేసుల వివరాలు, గత ఎన్నికల హామీల అమలును పరిశీలించాలి. కులం, మతం, డబ్బు, బహుమతుల ప్రలోభాలకు లొంగకుండా స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవాలి. ఎన్నికల తర్వాత కూడా ప్రజాప్రతినిధులను ప్రశ్నించాలి. భవిష్యత్తులో రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం, ఎన్నికల నిధుల్లో పారదర్శకత, అభ్యర్థుల ఎంపికలో నైతిక ప్రమాణాలు, పార్లమెంటు, శాసనసభల్లో నిర్మాణాత్మక చర్చలు, ఎన్నికల హామీల అమలుపై జవాబుదారీతనం పెరగాలి. కులమతాల ఆధారంగా ద్వేషాన్ని పెంచే రాజకీయాలకు బదులుగా సామాజిక ఐక్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజాస్వామ్యానికి ప్రమాదం కేవలం చెడు నాయకుల వల్లే కాదు. ప్రజలు ప్రశ్నించడం మానేసినప్పుడు, తప్పుడు ప్రచారాన్ని నమ్మినప్పుడు, కులమత విభేదాలకు లోనైనప్పుడు కూడా అది బలహీనపడుతుంది. నాయకులు శాశ్వతం కాదు, పార్టీలు శాశ్వతం కాదు, అధికారాలు శాశ్వతం కాదు. దేశం, రాజ్యాంగం, ప్రజలు, ప్రజాస్వామ్య విలువలే శాశ్వతం. ప్రజలను విభజించే రాజకీయాలు కాదు, ప్రజలను కలిపే రాజకీయాలు కావాలి. ఓట్ల కోసం వచ్చే నాయకులు కాదు, ప్రజల కష్టాల్లో తోడుగా నిలిచే నాయకులు కావాలి. ఒక పార్టీ కోసం మరో పౌరుడిని శత్రువుగా చూడకూడదు. ప్రజలు తమ హక్కులను తెలుసుకొని, పాలకులను నిరంతరం ప్రశ్నించినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రజలు మారితే రాజకీయాలు మారతాయి. రాజకీయాలు మారితే పాలన మారుతుంది. అప్పుడే ప్రజాస్వామ్య ఫలాలు ప్రతి ఒక్కరికీ అందుతాయి.

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9493541919.
Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.